జనం కోసం - మన అక్షరం

# అక్షర వెలుగు

TELTEL02057

www.aksharavelugu.com

తెలుగు దిన పత్రిక



ఏ.సి.బి. టోల్ ఫ్రీ నెంబర్ - 1064 -104

Anti-Corruption Bureau, Telangana State
అవినీతి నిరోధక శాఖ, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యాలయం
రోడ్ నెంబర్ 12, బంజారా హిల్స్, హైదరాబాద్ - 500 034
ఫోన్ నెంబర్ : 040-23251555, 9440446126
ఈ-మెయిల్ : dg_acb@telangana.gov.in

గురు వారం 24.03.22 | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : పృధ్విరాజు. జి | సంపుటి - 01, సంచిక-31 | పేజీలు - 4 | వెల రూ. 5

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

# సికింద్రాబాద్ బోయిగూడాలో ఘోర అగ్నిప్రమాదం

- మంటలు అంటుకుని 11మంది సజీవ దహనం
- రంగంలోకి దిగి మంటలను ఆర్పిన ఫైరింజన్లు
- వెంటనే సహాయక చర్యలు చేపట్టిన పోలీసులు
- ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సిఎం కెసిఆర్
- మృతుల కుటుంబాలకు 5లక్షల చొప్పన పరిహారం



**హైదరాబాద్, మార్చి 23 (అక్షర వెలుగు):** సికింద్రాబాద్‌లో ఘోర అగ్నిప్రమాదం జరిగింది.. బోయిగూడలోని ఓ స్క్రాప్ గోదాంలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో 11 మంది కార్మికులు సజీవదహనం అయ్యారు.. బుధవారం తెల్లవారుజామును స్క్రాప్ గోదాంలో అగ్నిప్రమాదం జరిగింది.. అందులో పనిచేస్తున్న కార్మికులు మంటల్లో చిక్కుకుపోయారు.. ఇద్దరు కార్మికులను ఫైర్ సిబ్బంది కాపాడారు.. ఇక, స్క్రాప్ గోదాం పక్కనే టింబర్ డిపోలు ఉన్నాయి.. స్థానికుల సమాచారంతో రంగంలోకి దిగిన ఎనిమిది ఫైర్ ఇంజన్లు.. మంటలను అదుపుచేశాయి.. కానీ, అప్పటికే 11 మంది కార్మికులు సజీవదహనం అయ్యారు.. ఈ ఘటనలో ఒక్కరు మాత్రమే ప్రాణాలతో బయటపడినట్టు తెలుస్తోంది. మృతులంతా బీహార్‌కు చెందిన కార్మికులుగా సమాచారం అందుతోంది.. ఇదో ప్లాస్టిక్ గోదాం కావడంతో ఇక్కడ ఎలాంటి రక్షణ చర్యలు లేవని ఆరోపణలు ఉన్నాయి.. షార్ట్ సర్క్యూట్ కారణంగా స్క్రాప్ గోదాంలో మంటలు చెలరేగి.. గోదాం మొత్తం వ్యాపించాయి.. స్క్రాప్ దుకాణంలో చెత్త కాగితాలు, ప్లాస్టిక్ కాలి, మందు బాటిళ్లు సామాన్లు ఉండడంతో మంటలు వ్యాపించాయి.. కార్మికులు నిద్రలోనే ప్రాణాలు కోల్పోయినట్టుగా చెబుతున్నారు.. మృతదేహాలను గాంధీ ఆస్పత్రి మార్చురీకి గాంధీ నగర్ పోలీసులు తరలించారు. మంటల ధాటికి మృతదేహాలు గుర్తు పట్టనంతగా ముద్దగా మారాయి. బుధవారం ఉదయం 4 గంటల సమయంలో బోయిగూడలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. క్రమంగా అవి మొత్తానికి వ్యాపించడంతో పెద్ద ఎత్తున్న అగ్నికీలలు ఎగసిపడ్డాయి. ఆ ప్రాంతం మొత్తం దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. సమాచారం అదుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఐదు ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపుచేశారు. (మిగతా 2వ పేజీలో)

## పెట్రో ధరల పెంపు దారుణం: ఎమ్మెల్యే

**నిజామాబాద్, మార్చి 23 (అక్షర వెలుగు):** నిత్యావసర సరుకులు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను అరికట్టలేని అసమర్థ ప్రధాని నరేంద్ర మోదీ అని ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్రెడ్డి అన్నారు. ఎన్నికలయ్యాఏ వరకు వేచిచూసి ఇప్పుడు దొంగదెబ్బ తీస్తున్నారని మండిపడ్డారు. సిగ్గూఎగ్గూ లేకుండా వరుసగా రెండోరోజు కూడా ధరలు పెంచారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉక్రెయిన్ యుద్ధాన్ని బూచిగా చూపి అడ్డగోలుగా ధరలు పెంచి ప్రజలపై పెనుభారం వేస్తోందన్నారు. యూపీఏ పాలనలో 400 రూపాయలు ఉన్న గ్యాస్ ధర 1,050కి పెరిగిందన్నారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. గ్యాస్ ధరలను పెంచితే మహిళల ఏం కావాలని అన్నారు.కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపు రవాణా రంగంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యాన్ని కేంద్ర ప్రభుత్వం కొనాలన్నారు.

## కేంద్రమంత్రి బిశ్వేశ్వర్ తుడుపై ప్రివిలేజ్ నోటీస్

- గిరిజన రిజర్వేషన్లపై తప్పుడు ప్రకటన
- మంత్రి తీరుకు నిరసనగా లోక్‌సభ నుంచి టిఆర్ఎస్ వాకౌట్
- సభలోనే మంత్రి క్షమాపణలు చెప్పాలన్న ఎంపిలు

**న్యూఢిల్లీ, మార్చి 23 (అక్షర వెలుగు):** కేంద్ర గిరిజన శాఖ సహాయ మంత్రి బిశ్వేశ్వర్ తుడుపై లోక్‌సభలో టీఆర్ఎస్ ఎంపీలు ప్రివిలేజ్ నోటీసు ఇచ్చారు. కేంద్రం తీరుకు నిరసనగా ఎంపీలు బుధవారం లోక్‌సభలో ఆందోళన చేపట్టారు. గిరిజనుల రిజర్వేషన్లు పెంచాలని టీఆర్ఎస్ ఎంపీలు నినాదాలు చేశారు. అనంతరం సభ నుంచి వాకౌట్ చేశారు. గిరిజనుల రిజర్వేషన్లు పెంచాలని తెలంగాణ అసెంబ్లీ తీర్మానం పంపలేదని బిశ్వేశ్వర్ తుడు అబద్ధాలాడి, పార్లమెంట్‌ను తప్పుదోవ పట్టించారని ఎంపీలు నోటీసులో పేర్కొన్నారు. గిరిజనులకు, తెలంగాణ (మిగతా 2వ పేజీలో)

## నేడు పదిమంది తెలంగాణ జడ్జిల ప్రమాణం

**హైదరాబాద్, మార్చి 23 (అక్షర వెలుగు):** పది మంది నూతన హైకోర్టు జడ్జిలు గురువారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులుగా సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసిన 12 మంది పేర్లలో 10 మంది పేర్లకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోద ముద్ర వేశారు. దీంతో న్యాయమూర్తుల నియామకాలను నోటిఫై మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. వీరిలో న్యాయవాదుల కోటా నుంచి ఐదుగురు, న్యాయాధికారుల (జ్యుడీషియల్ ఆఫీసర్స్) కోటా నుంచి ఐదుగురు ఉన్నారు. న్యాయమూర్తులుగా నియమితులైనవారిలో కాసోజు సురేందర్, సూరేపల్లి నందా, ముమ్మినేని సుధీర్ కుమార్, జువ్వాడి శ్రీదేవి, నచ్చరాజు శ్రవణ్‌కుమార్, జి.అనుపమా చక్రవర్తి, ఎంజీ ప్రియదర్శిని, సాంబశివరావునాయుడు, ఏనుగు సంతోష్ రెడ్డి, డాక్టర్ దేవరాజు నాగార్జున్ ఉన్నారు. నూతన హైకోర్టు జడ్జిలు రేపు ప్రమాణస్వీకారం చేస్తారు.

# పెట్రో ధరలకు విరుగుడు ఎలక్ట్రిక్ వాహనాలు

- తయారీదారులను ప్రోత్సహించనున్న ప్రభుత్వం
- విద్యుత్ ఛార్జింగ్ సెంటర్లకు కూడా ప్రాధాన్యం



**న్యూఢిల్లీ, మార్చి 23 (అక్షర వెలుగు):** ప్రస్తుతం అడ్డూ అదుపు లేకుండా పెరిగిపోతున్న పెట్రోల్, డీజిల్ ధరలతో వాహన దారులకు మరింత భారంగా మారుతోంది. ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై దృష్టి సారించాల్సిన ఆగత్యం ఏర్పడింది. ఎలక్ట్రిక్ వాహనాల ఆవశ్యకత పెరిగింది. ముఖ్యంగా వాహనాల ఇంధన ధరలు పెరుగుతున్న నేపథ్యంలో పలు వాహనాల తయారీ కంపెనీలు ఎలక్ట్రిక్ వాహనాలను అందుబాటులోకి తీసుకువస్తున్నాయి. దీంతో వాహనదారులు కూడా ఎలక్ట్రిక్ వాహనాల వైపు మొగ్గు చూపుతున్నారు. తయారీదారులను ప్రోత్సాహించాని కేంద్రం కూడా ఆలోచిస్తోంది. ఇది అమల్లోకి వస్తే రానున్న రెండుమూడేళ్లలో ఈ తరహా వాహనాలకు గిరాకీ పెరగగనుంది. ఇక చమురు ధరలు పెరిగిపోతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కాలుష్యానికి కారణమవుతున్న పెట్రోల్, డీజిల్ వాహనాలను తగ్గించి కేవలం ఎలక్ట్రిక్ వాహనాలనే నడపాలని భావిస్తోంది. ఇందుకోసం ఓ భారీ ప్రణాళిక సైతం రచించింది. ఇప్పటికే చాలా మంది పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతుండటంతో ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేస్తున్నారు. ముందుగా ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు అందుబాటులోకి రాగా, కార్లు కూడా వచ్చేస్తున్నాయి. ఇక రానున్న రోజుల్లో ఎలక్ట్రిక్ వాహనాలు ధరలు తగ్గనున్నాయని కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. అలాగే ఛార్జింగ్ స్టేషన్లు కూడా అధిక మొత్తంలో ఏర్పాటు అయ్యేందుకు అనుమతులు కూడా మంజూరు చేసినట్లు తెలిపారు. వచ్చే రెండేళ్లలో పెట్రోల్, డీజిల్ వాహనాలకు సమానంగా ఎలక్ట్రిక్ వాహనాల ధరలు ఉంటాయని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లు పెద్దగా లేవు. ధరల విషయంలో పలు డిస్కౌంట్లు, ఆఫర్లు చేస్తోంది ప్రభుత్వం. భారత్‌లో భారీ మొత్తంలో ఎలక్ట్రిక్ వాహనాలను తీసుకువచ్చేందుకు అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తున్నాయి. దీంతో ఎలక్ట్రిక్ వాహనాల ధరలు దిగి వస్తాయని మంత్రి తెలిపారు. (మిగతా 2వ పేజీలో)

# మీకు మీరే బ్రాండ్ అంబాసిడర్లు

- బడులు,గుడులు కట్టించి ఊరు రుణం తీర్చుకోండి
- అమెరికా పర్యటనలో ఎన్నారైలతో కెటిఆర్ ముఖాముఖి

**హైదరాబాద్, మార్చి 23 (అక్షర వెలుగు):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మన ఊరు మన బడి పథకంపై ఎన్ఆర్ఐలతో మంత్రి కేటీఆర్ ముఖాముఖి



నిర్వహించారు. అమెరికా పర్యటనలో ఉన్న కేటీఆర్ కాలిఫోర్నియాలోని మిల్పిటాస్‌లో మీట్ అండ్ గ్రీట్ విత్ కేటీఆర్ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ అభివృద్ధిలో మీ అందరి భాగస్వామ్యం ఉండాలన్నారు. మీకు మించిన బ్రాండ్ అంబాసిడర్స్ ఎవరూ ఉండరు. తెలంగాణ గురించి మీరే గొప్పగా ప్రచారం చేయగలరు. అభివృద్ధిలో ముందంజలో ఉన్నాం. మనం చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తమ వంతుగా సహాయం చేయాలన్నారు. గుడులు కట్టించే వారు గుడులను కట్టించండి.. బడులు కట్టించే వారు బడులు కట్టించండి.. లైబ్రరీలు కట్టించే వారు లైబ్రరీలు కట్టించండి.. దీని వల్ల స్థానికుల నుంచి వచ్చే కృతజ్ఞత మరిచిపోలేనిదిగా ఉంటుందన్నారు. విద్యావ్యవస్థను పటిష్టం చేస్తున్నాం. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కంటే ముందు తెలంగాణలో కేవలం మూడు మెడికల్ కాలేజీలు మాత్రమే ఉన్నాయి. తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తర్వాత కొత్తగా 33 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసుకుంటున్నామని కేటీఆర్ తెలిపారు. అలా వైద్య విద్యతో పాటు స్కూల్ ఎడ్యుకేషన్‌ను పటిష్టం చేస్తున్నామని కేటీఆర్ స్పష్టం చేశారు. రూ. 7,230 కోట్ల తో తెలంగాణలోని 26 వేల పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కంకరణం కట్టుకుందని (మిగతా 2వ పేజీలో)

# తెలంగాణ ప్రజలకు విద్యుత్ షాక్

- ఏప్రిల్ 1 నుంచి భారీగా పెరగనున్న ఛార్జీలు
- ఛార్జీలు పెంచుకునేందుకు ఈఆర్సీ అనుమతి
- యూనిట్‌కు 40 నుంచి 50 పైసల వరకు పెరిగే ఛాన్స్
- ప్రజలపై భారీగా పడనున్న విద్యుత్ ఛార్జీల భారం



**హైదరాబాద్, మార్చి 23 (అక్షర వెలుగు):** తెలంగాణలో విద్యుత్ ఛార్జీల పెంపునకు రంగం సిద్ధమైంది. ఈఆర్సీ అనుమతించడంతో ధరలు పెరగనున్నాయి. 14 శాతం విద్యుత్ ఛార్జీలను పెంచుతూ టీఎస్ఈఆర్సీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అయితే 19 శాతం పెంపునకు డిస్కంలు అనుమతి కోరాయి. డొమెస్టిక్ మీద 40 పైసల నుంచి 50 పైసలు పెంచనున్నారు. ఇతర కేటగిరీలపై యూనిట్‌కు రూపాయి చొప్పున పెరుగనుంది. దీంతో వినియోగదారులపై భారీగా భారం పడనుంది. ఇప్పటికే ధరల పెరుగుదలపై విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. అయినా ప్రభుత్వం ధరల పెంపునకే మొగ్గు చూపింది. ఎండాకాలంలో విద్యుత్ రేట్లు షాక్ ఇవ్వబోతున్నాయి. ఈఆర్సీ అనుమతించడంతో తెలంగాణలో విద్యుత్ ఛార్జీలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డిస్కంల వినతి మేరకు కరెంటు ఛార్జీలను పెంచుతూ కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 14 శాతం విద్యుత్ ఛార్జీలను పెంచుతూ తెలంగాణ ఈఆర్సీ ఉత్తర్వులు జారీ చేసింది. డొమెస్ట్ (మిగతా 2వ పేజీలో)

# తెలంగాణ బియ్యం ఎగుమతులకు కేంద్రం అనుమతి

- ధాన్యం సేకరణలో మాత్రం తెలంగాణకు షాక్
- ఉత్పత్తి అయిన మొత్తం ధాన్యం కొనలేమన్న పీయూష్ గోయల్
- ఉత్పత్తి, డిమాండ్, అవసరాల మేరకే సేకరణ ఉంటుందని వెల్లడి
- నేడు టిఆర్ఎస్ మంత్రుల బృందానికి అపాయింట్‌మెంట్



**న్యూఢిల్లీ, మార్చి 23 (అక్షర వెలుగు):** తెలంగాణ నుంచి బియ్యం ఎగుమతులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. తెలంగాణ నుంచి బియ్యం ఎగుమతికి అపార అవకాశాలు ఉన్నాయన్నారు. ఎగుమతిదారులు సైతం తెలంగాణ నుంచి పెద్దఎత్తున బియ్యాన్ని ఎగుమతులు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. గతేడాది కూడా తెలంగాణ నుంచి బియ్యం ఎగుమతులు జరిగాయని ఆయన తెలిపారు. అయితే తెలంగాణలో ధాన్యం సేకరణపై అడిగిన ప్రశ్నకు నేరుగా స్పందించేందుకు గోయల్ నిరాకరించారు. ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ ప్రభుత్వానికి కేంద్రం షాక్ ఇచ్చింది. తెలంగాణలో ఉత్పత్తి అయిన ధాన్యం, బియ్యం మొత్తాన్ని కొనలేమని పార్లమెంట్‌లో తెగేసి చెప్పింది. కేవలం ఆయా రాష్ట్రాల్లో ఉత్పత్తుల ఆధారంగా కొనుగోళ్లు చేయలేమని తెలిపింది. అదనంగా ఉన్న ఉత్పత్తులు, రేటు, డిమాండ్. సరఫరా పరిస్థితుల ఆధారంగానే కొనుగోళ్లు జరుగుతాయని కేంద్రం స్పష్టం చేసింది. లోక్‌సభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ వ్యవహారాల శాఖ మంత్రి పీయూష్ మంత్రి గోయల్ సమాధానం ఇచ్చారు. ఉత్పత్తి ఆధారంగా ధాన్యం, బియ్యం సేకరణ చేయడం సాధ్యం కాదని పార్లమెంట్ కేంద్ర ప్రభుత్వం తేల్చిచెప్పింది. లోకసభలో ఎంపీలు సుమలత, మనీష్ తివారి, రాజ్ దీప్ రాయ్, మనోజ్ సహా పలువురు సభ్యులు ధాన్యం సేకరణపై అడిగిన ప్రశ్నలకు కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రులు పీయూష్ గోయల్, ఆ శాఖ సహాయ మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి రాతపూర్వకంగా సమాధానం ఇచ్చారు. ధాన్యం సేకరణకు అనేక అంశాలు ముడిపడి ఉంటాయని కేంద్ర ఆహార, వినియోగదారుల వ్యవహారాల శాఖ స్పష్టం చేసింది. కనీస మద్దతు ధర, డిమాండ్, సరఫరా, మార్కెట్‌లో ఉన్న ధరలు, ఇతర పరిస్థితుల ఆధారంగానే సేకరణ జరుగుతుందని కేంద్రం తెలిపింది.

# బీజేపీ కా సాత్... దేశ్ కా వినాష్...

- మోదీ విధానాలతో పేద, మధ్యతరగతి ప్రజలపై మోయలేని భారం
- పెట్రోలు, డీజిల్ గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి
- తెలంగాణ ఆప్ సర్చ్ కమిటీ చైర్‌పర్సన్ ఇందిరా శోభన్



**హైదరాబాద్,మార్చి 23 (అక్షర వెలుగు):** సబ్ కా సాత్.. సబ్ కా వికాష్ అని చెప్పే మోడీ ఆయన అధికారంలోకి వచ్చిన తరువాత బీజేపీ కా సాత్...దేశ్ కా వినాష్‌గా మారిపోయిందని తెలంగాణ ఆప్ సర్చ్ కమిటీ చైర్‌పర్సన్ ఇందిరా శోభన్ ఆరోపించారు. పెంచిన పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలను నిరసిస్తూ నగరంలో ర్యాలీ నిర్వహించారు. ట్యాంక్‌బండ్ రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఖాళీ సిలెండర్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అధికారంలోకి (మిగతా 2వ పేజీలో)

జనం కోసం - మన అక్షరం
అక్షర వెలుగు
www.aksharavelugu.com తెలుగు దిన పత్రిక

# కోటి ఎకరాల తెలంగాణ మాగాణం ఏమయ్యింది

- ధాన్యం సేకరణలో విధానం లేకుండా కెసిఆర్ వ్యాఖ్యలు
- బిజెపిపై కోపంతో రైతులకు నష్టం చేయొద్దు
- కేంద్రం నిబంధనల మేరకే ధాన్యం కొంటుంది
- ఎస్టీ రిజర్వేషన్ల బిల్లు కేంద్రానికి చేరకపోడం దారుణం
- మీడియా సమావేశంలో మాజీమంత్రి ఈటెల రాజేందర్



**హైదరాబాద్, మార్చి 23 (అక్షర వెలుగు):** సీఎం కేసీఆర్ బీజేపీపై ఉన్న కోపాన్ని రైతులపై చూపెడుతున్నారని బిజెపి ఎమ్మెల్యే ఈటల రాజేందర్ మండిపడ్డారు. ధాన్యం సేకరణలో రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఓ ఏజెన్సీగా మాత్రమే పని చేస్తుందన్న ఆయన అందుకు అవసరమైన డబ్బును కేంద్రమే ఇస్తుందని స్పష్టం చేశారు. కోటి ఎకరాల మాగాణి అంటున్న కెసిఆర్ అందుకు ప్రణాళికలు లేకుండా పనిచేస్తున్నారని అన్నారు. వ్యవసాయరంగంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అత్యంత గందరగోళ పరిస్థితుల్లో ఉందని ఈటల వాపోయారు. కేసీఆర్ సర్కారుకు ముందు చూపులేక, చిన్నచూపు చూడటం వల్లే సమస్య ఉత్పన్నమవు తోందని విమర్శించారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా కేసీఆర్ సర్కారు కూలిపోవడం ఖాయమని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రతి పంటను కొనుగోలు చేస్తామని అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన.. రాష్ట్ర రైతాంగం ప్రయోజనాల కోసమే పార్టీ కృషి చేస్తుందని చెప్పారు. కేంద్రం ధాన్యాన్ని కొనుగోలు చేయమని ఎప్పుడూ చెప్పలేదని స్పష్టం చేసిన ఈటల... రైతులు పండించిన వడ్లను పార్టీ కార్యాలయాలు, ఇళ్ల ముందు పోస్తామని కేసీఆర్ బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్ బీజేపీ మీద ఉన్న కోపాన్ని రైతుల మీద చూపెడుతున్నారని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ధాన్యం సేకరణకు డబ్బులన్నీ కేంద్రమే ఇస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం ఒక ఏజెన్సీగా మాత్రమే పనిచేస్తుందని, తెలంగాణ రాష్ట్రం వ్యవసాయంరంగంలో దేశంలోనే అత్యంత గందరగోళ పరిస్థితిలో ఉందని ఆయన వ్యాఖ్యానిం చారు. ధాన్యం సేకరణ కొత్తగా వచ్చింది కాదు దశాబ్దాలుగా కొనసాగు తుందని, వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు వచ్చాక పంట పెరిగిందన్నారు. ఫుడ్ కార్పొరేషన్ రెండు విధానాల్లో ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని, డీసీపీ పద్ధతిని తెలంగాణ రాష్ట్రం ఎంచుకుని ధాన్యాన్ని ఇస్తుందని, ముందుచూపు లేక చిన్నచూపు చూడటం వల్లే సమస్య ఉత్పన్నం అవుతుంద న్నారు. పార్టీ ఆఫీసుల మీద దాడులు, ధర్నాలు చేస్తారా అని ఆయన ప్రశ్నించారు. వడ్లు పండించి పార్టీ కార్యాలయం, ఇళ్ల ముందు పోస్తామని కేసీఆర్ బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని, వరి వేయవద్దంటే.. రైతుల పరిస్థితి ఏమి కావాలన్నారు. కోటి ఎకరాల్లో పంట పండిస్తే కేసీఆర్ ఎక్కడ అమ్ముకుంటావు అని, తెలంగాణ కోటి ఎకరాల మాగాణి అంటివి కేసీఆర్ ఏమైందని ఆయన మండిపడ్డారు. కేంద్రం ధాన్యాన్ని కొనుగోలు చేయమని ఎక్కడా చెప్పలేదని, ఎప్పుడూ ఎన్నికలు వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం కూలిపోతుందని ఆయన వెల్లడించారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రతి పంటను కొనుగోలు చేస్తామని, రాష్ట్ర రైతాంగం ప్రయోజనాల కోసం తెలంగాణ బీజేపీ కృషి చేస్తోందని, జనాభా ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు పెంచుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు బిల్లు కేంద్రానికి పంపిన మాట వాస్తవమేనని ఆయన వ్యాఖ్యానించారు. దీంతో బీజేపీలో ఈటల వ్యాఖ్యలు హాట్‌టాపిక్‌గా మారాయి. ఎస్టీల రిజర్వేషన్ బిల్లును రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపిన మాట వాస్తవమేనని ఈటల అన్నారు. జనాభా ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు పెంచుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని స్పష్టం చేశారు.

# తెలంగాణ ప్రజలకు విద్యుత్ షాక్

(మొదటి పేజీ తరువాయి..) మీటర్లపై యూనిట్ కు 40 నుంచి 50 పైసల వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. అలాగే ఇతర కేటగిరీలపై యూనిట్‌కు రూపాయి చొప్పున పెంచుతూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కాగా.. రాష్ట్రంలో 19 శాతం మేర విద్యుత్ ఛార్జీల పెంపునకు అనుమతి కోరగా.. 14 శాతం మాత్రమే విద్యుత్ ఛార్జీలను పెంచుతూ తెలంగాణ ఈఆర్‌ఎసీ ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం తీసుకోనున్నారు. ఒకవేళ సీఎం కేసీఆర్ చార్జీల పెంపు కే మొగ్గు చూపితే రాష్ట్రంలో ఏప్రిల్ ఒకటి నుంచి కరెంటు ఛార్జీలు భారీగా పెరగనున్నాయి. దీనిపై ప్రభుత్వం నుంచి అధికారిక ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది. అయితే వ్యవసాయం,సెలూన్లకు పెంపు వర్తించబోదని స్పష్టం చేసింది. ఈ మేరకు మీడియా సమావేశంలో రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్సీ) ఛైర్మన్ టి.శ్రీరంగారావు వెల్లడించారు. డిస్కమ్‌లు ఐదేళ్ల విద్యుత్ టారిఫ్ ప్రతిపాదనలు కమిషన్ ముందుంచాయని, దీనిపై వినియోగదారుల అభిప్రాయాలను కమిషన్ పరిగణనలోకి తీసుకుందని ఈఆర్సీ ఛైర్మన్ తెలిపారు. 2022-23 ఏడాదికి డిస్కమ్‌లు ప్రతిపాదించిన రెవెన్యూ గ్యాప్ రూ.16వేల కోట్లని చెప్పారు. కానీ, రూ.14,237 కోట్ల రెవెన్యూ గ్యాప్‌ను కమిషన్ ఆమోదించిందని వివరించారు.వ్యవసాయానికి విద్యుత్ టారిఫ్ పెంచలేదు. ఈవీ ఛార్జింగ్‌కు టారిఫ్ ప్రతిపాదనలు ఆమోదించలేదు. డిస్కమ్‌లు నవంబర్ 30లోపు ప్రతిపాదనలు కమిషన్ ముందు ఉంచాలని శ్రీరంగారావు అన్నారు. ఆసక్తిగలవారు స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్ల ఏర్పాటు చేసుకోవచ్చని ఈఆర్సీ ఛైర్మన్ తెలిపారు. జీడిమెట్ల స్మార్ట్ గ్రిడ్ పూర్తిస్థాయిలో విస్తరించాలని అధికారులకు సూచించారు. ద్రవ్యలోటు రూ.6,338 కోట్లుగా డిస్కమ్‌ల ప్రతిపాదించాయని... రూ.5,596 కోట్లకు కమిషన్ ఆమోదం తెలిపిందని చెప్పారు.

# పెట్రో ధరలకు విరుగుడు ఎలక్ట్రిక్ వాహనాలు

(మొదటి పేజీ తరువాయి..)ఇక ఎలక్ట్రిక్ వాహనాలు అందుబాటులోకి వస్తుండటంతో ఛార్జింగ్ స్టేషన్లు కూడా భారీగా ఏర్పాటు కానున్నాయి. ఫేమ్ ఇండియా స్కీమ్ ఫేస్ 2 కింద 16 జాతీయ రహదారులు, 9 ఎక్స్‌ప్రెస్‌వేలపై 1576 ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్‌లను మంజూరు చేసింది కేంద్ర మంత్రిత్వశాఖ. జాతీయ రహదారుల వెంట ఇరు వైపులా ప్రతి 25 కిలోమీటర్ల దూరంలో ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు కానుంది. అలాగే హేవీ డ్యూటీ వెహికిల్స్ కోసం జాతీయ రహదారులపై ప్రతి 100 కి.మీలకు ఇరు ఒక ఛార్జింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తోంది. వీటిలో 266 ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్లను ఏపీలోని రహదారులపై, తెలంగాణలో 138 స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్టు భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఇందులో భాగంగా 25 రాష్ట్రాల్లో, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 68 నగరాలలో 2,877 ఛార్జింగ్ స్టేషన్‌లు మంజూరు చేసింది. ఇవి పక్కాగా అమలు చేస్తే ఇంధనల ధరలపై పెట్టుబడులు పెట్టాల్సిన ఆగత్యం ఉండదు. అలాగే ధరల భయం కూడా ఉండదు.

# మీకు మీరే బ్రాండ్ అంబాసిడరు

(మొదటి పేజీ తరువాయి..) కేటీఆర్ తెలిపారు. ఈ విద్యా యజ్ఞంలో మీరు కూడా పాలు పంచుకోవాలి. నా మాతృభూమి కోసం, నా గ్రామం, పట్టణం కోసం.. నేను ఏదైనా చేయాలి.. చేస్తే బాగుంటుందని, అవసరమైతే నా తల్లిదండ్రుల పేరు మీదో, నా గ్రాండ్ పేరెంట్స్ పేరు మీదో ఏదో చేయాలనుకుంటే ఈ విద్యాయజ్ఞంలో పాల్గొనే అవకాశం ఉంది. మీ మీద ఆధారపడి ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమం కాదు. విద్యా రంగాన్ని పటిష్టం చేసేందుకు ప్రయివేటు వ్యక్తుల సహకారం కోసమేనని చెప్పారు. మీకు ఇష్టమున్న పాఠశాలను ఎంపిక చేసుకొని అభివృద్ధి చేయొచ్చన్నారు. ఇది ఒక అద్భుత అవకాశం అని కేటీఆర్ పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టబోతున్నా మని తెలిపారు. అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం ముందంజలో ఉందని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కనీస సదుపాయాలపై దృష్టి సారించామని స్పష్టం చేశారు. దేశానికి నిధులు సమకూరుస్తున్న నాలుగో అతిపెద్ద రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. కరోనా సమయంలోనూ 14 శాతం వృద్ధిరేటు నమోదు చేశాం. దేశ జనాభాలో తెలంగాణ 12వ స్థానంలో ఉందన్నారు. తెలంగాణ ఏర్పడే నాటికి కరెంట్ కోతలతో తెలంగాణ అల్లాడుతోంది. కరెంట్ సమస్యను సీఎం కేసీఆర్ తొలి ఆరు నెలల్లోనే పరిష్కరించారు. విద్యుత్ వ్యవస్థాపక సామర్థ్యం 7 వేల మెగావాట్ల నుంచి 16 వేల మెగావాట్లకు పెంచామని తెలిపారు. అన్ని రంగాలకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ను అందిస్తున్నామని చెప్పారు. ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీటిని అందిస్తున్నాం. ప్రపంచంలోనే అతి పెద్దదైన కాళేశ్వరం ప్రాజెక్టును నాలుగేండ్ల లోనే పూర్తి చేసి ప్రతి ఎకరానికి సాగునీరు అందిస్తున్నాం. తెలంగాణ నుంచి వ్యవసాయ ఉత్పత్తులు పెరిగాయి. పంజాబ్‌తో సమానంగా వరి ధాన్యం ఉత్పత్తి చేస్తున్నామని తెలిపారు. ఒకప్పటి కరువు నేల నేడు దేశానికి అన్నపూర్ణగా మారిందన్నారు. ఇదంతా కేసీఆర్ సమర్థవంతమైన పాలన వల్లే సాధ్యమైందన్నారు. టీఎస్ ఐపాస్ చట్టం అమలు చేసిన తర్వాత తెలంగాణకు పరిశ్రమలు తరలివచ్చాయి. ప్రపంచ స్థాయి కంపెనీలు తమ కార్యకలాపాలను హైదరాబాద్‌లో ప్రారంభించాయని మంత్రి కేటీఆర్ తెలిపారు.

# వరుసగా రెండోరోజూ పెట్రో బాంబ్

**కొనసాగిన పెట్రోల్ ధరల పెరుగుదల**

**లీటరు పెట్రోల్‌పై 90 పైసలు, డీజిల్‌పై 87 పైసలు వడ్డింపు**



**న్యూఢిల్లీ, మార్చి 23 (అక్షర వెలుగు):** దేశవ్యాప్తంగా పెట్రో ధరలు వరుసగా రెండోరోజూ పెరిగాయి. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత కాస్త గ్యాప్ తీసుకున్న పెట్రో, గ్యాస్ ధరలు పెరిగిపోతున్నాయి.. వరుసగా రెండో రోజు కూడా పెట్రో ధరలను వడ్డించాయి చమురు సంస్థలు.. ఐదు రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో కొన్ని నెలలపాటు విరామం ఇచ్చిన చమురు కంపెనీలు.. మంగళవారం నుంచి ధరల పెంపును ప్రారంభించాయి.. వరుసగా రెండో రోజు లీటరు పెట్రోల్‌పై 90 పైసలు, డీజిల్‌పై 87 పైసలు వడ్డించాయి ఢిల్లీలో వరుసగా రెండో రోజు బుధవారం పెట్రోల్, డీజిల్ రిటైల్ ధర 80 పైసలు పెరిగింది. ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ. 97.01 కాగా, డీజిల్ ధర రూ. 88.27కి పెరిగింది. పెట్రోల్, డీజిల్ ధరలు మంగళవారం లీటరుకు 80 పైసలు పెంచగా, దేశీయ వంట గ్యాస్ ఎల్‌పిజి ధరలు సిలిండర్‌కు రూ. 50 చొప్పున పెంచారు. ఎందుకంటే రాష్ట్ర చమురు సంస్థలు నాలుగున్నర నెలల విరామంతో రేట్ల సవరణను ముగించాయి. ఎల్‌పిజి రేట్లు చివరిగా అక్టోబర్ 6, 2021న సవరించబడినప్పటికీ, ఉత్తరప్రదేశ్, పంజాబ్‌తో సహా ఐదు రాష్ట్రాల ఎన్నికలకు వెళ్ళినందున నవంబర్ 4 నుండి పెట్రోల్, డీజిల్ ధరలు పెరగకుండా ఫ్రీజ్‌లో ఉన్నాయి. హైదరాబాద్ లో లీటర్ పెట్రోల్ రూ 110.01, డీజిల్ రూ.96.37కి చేరింది. గుంటూరులో లీటర్ పెట్రోల్ రూ.112.08, డీజిల్ రూ.98.10, విజయవాడలో లీటర్ పెట్రోల్ రూ.111.88, డీజిల్ రూ.97.90గా నమోదైంది. ఆర్థిక రాజధాని ముంబైలో పెట్రోలు లీటరుకు రూ. 111.58, డీజిల్: లీటరుకు రూ. 95.74కి చేరింది. చమురు ధరలు పెరుగుతుండడంతో వాహన దారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడు ప్రభుత్వరంగ ఇంధన రిటైలర్లు.. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్.. భారతదేశంలో ఇంధన రిటైలింగ్‌లో ఆధిపత్యం చెలాయిస్తున్న విషయం తెలిసిందే కాగా.. అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో ధరలను పెంచడానికే మొగ్గు చూపుతున్నాయి. ఇక, ముంబైలో, పెట్రోల్ ధర లీటరుకు రూ.111.67కి, డీజిల్ లీటర్‌కు రూ.95.85కి పెరిగింది. కోల్‌కతా మరియు చెన్నైలో పెట్రోల్ మరియు డీజిల్ ధరలు వరుసగా రూ.106.34 మరియు రూ.91.42, చెన్నైలో రూ.102.91 మరియు రూ.92.95 చేరింది.. మరోవైపు బెంగళూరులో పెట్రోల్ ధర రూ.102.26గా, డీజిల్ రూ.86.58కి చేరింది. హైదరాబాద్‌లో లీటరు పెట్రోలు ధర రూ.110, డీజిల్ ధర రూ.96.36కు చేరగా.. ఏపీలో లీటర్ పెట్రోల్‌పై 87పైసలు, డీజిల్‌పై 84 పైసలు పెరగడంతో.. గుంటూరులో లీటర్ పెట్రోల్ రూ.112.08, డీజిల్ రూ.98.10కి ఎగబాకింది. దేశవ్యాప్తంగా రిటైల్ ధరలను తగ్గించేందుకు గత ఏడాది నవంబర్ 3న కేంద్రం ఎక్సైజ్ సుంకాన్ని లీటర్ పెట్రోల్‌పై రూ.5, డీజిల్‌పై రూ.10 చొప్పున తగ్గించింది..అంతర్జాతీయ చమురు ధరలు ఈ సంవత్సరం మళ్లీ పెరగడంతో మళ్లీ వడ్డింపులు ప్రారంభించాయి.

# సికింద్రాబాద్ బోయిగూడాలో ఘోర అగ్నిప్రమాదం

(మొదటి పేజీ తరువాయి..) మంటల ధాటికి గోడౌన్ పైకప్పు కూలిపోయింది. ఈ ప్రమాదంలో పదకొండు మంది అక్కడికక్కడే మరణించారని అధికారులు చెప్పారు. వీరిలో కొందరు సజీవదహనమవగా, మరికొందరు ఊపిరాడక చనిపోయారన్నారు. మరొకరు క్షేమంగా బయటపడ్డారని వెల్లడించారు. ప్రమాద సమయంలో టింబర్ డిపోలో 12 మంది ఉన్నారని చెప్పారు. మృతులంతా బీహార్‌కు చెందిన వలస కార్మికులని తెలిపారు. మృతులను సికిందర్ (40), బిట్టు (23), సత్యేందర్ (35), గోలు (28), దామోదర్ (27), రాజేశ్ (25), దినేశ్ (35), రాజేశ్ (25), చింటు (27), దీపక్ (26), పంకజ్ (26)గా గుర్తించారు. అగ్నిప్రమాదం జరిగిన భవనంలో టింబర్ డిపో, స్క్రాప్ గోదాం ఉన్నాయని పోలీసులు చెప్పారు. టింబర్ డిపో నుంచి స్క్రాప్ గోదాముకు మంటలు వ్యాపించాయన్నారు. పొగ దట్టంగా కమ్ముకోవడంతో మృతదేహాలను వెలికితీయడానికి ఇబ్బందయిందని తెలిపారు. అగ్ని ప్రమాదానికి షార్ట్ సర్క్యూటే కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. అగ్నిప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున సీఎం పరిహారం ప్రకటించారు. మృతదేహాలను బీహార్‌కు పంపించే ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్‌కు సీఎం కేసీఆర్ ఆదేశాలు జారీ చేశారు.

# బీజేపీ కా సాత్... దేశ్ కా వినాష్...




(మొదటి పేజీ తరువాయి..) వచ్చిన తరువాత నిత్యావసర సరుకులు మొదలుకొని పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు అత్యంత వేగంతో పెరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా గ్యాస్ సిలెండర్ ధర వెయ్యి రూపాయలు దాటడంతో మహిళలు వంట వండలేక తిరిగి కట్టెల పొయ్యిని ఆశ్రయించే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. కార్పొరేట్ కంపెనీలకు ఆదాయం సమకూర్చే పనిలో మోడీ పడ్డారని, వారు ఎలా చెబితే అలా వింటూ ధరల పెరుగుదలకు అనుమతి ఇవ్వడం సిగ్గు చేటన్నారు. పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు ఇష్టారాజ్యంగా పెంచుకుంటూపోవడం వల్ల ఆ ప్రభావం నిత్యావసర సరుకుల ధరలపై కూడా పడుతుందన్నారు. పెరిగిన ధరలతో పేద, సామాన్య ప్రజలు బతకలేని పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాగే ఉంటే పేదలందరు ఆకలి చావులకు గురయ్యే ప్రమాదం కూడా లేకపోలేదని చెప్పారు. కనుక ఇప్పటికైనా మోడీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేయడం మానుకొని నిత్యావసర ధరలు మొదలుకొని పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రజలు కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ప్రశ్నించకపోతే రాబోయే రోజుల్లో ప్రజలపై మరిన్ని భారాలు మోపి బతుకులు దుర్భరం చేసే అవకాశం లేకపోలేదని హెచ్చరించారు. కనుక పెరిగే ధరలకు అడ్డుకట్ట వేయాలన్నా, పేద ప్రజల జీవితాల్లో వెలుగు రావాలన్నా బీజేపీని ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. పేదల కోసం ఆలోచించే ఆప్ కు పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ఆమ్ ఆద్మీ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రమంత్రి బిశ్వేశ్వర్ తుడుపై ప్రివిలేజ్ నోటీస్

(మొదటి పేజీ తరువాయి..) ప్రజలకు కేంద్ర మంత్రి క్షమాపణలు చెప్పాలని ఎంపీలు డిమాండ్ చేశారు. సభను తప్పుదోవ పట్టించిన బిశ్వేశ్వర్‌ను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. గిరిజనుల రిజర్వేషన్ పెంచాలని తెలంగాణ అసెంబ్లీ తీర్మానం చేసి, కేంద్రానికి పంపిందని టీఆర్ఎస్ ఎంపీలు స్పష్టం చేశారు. జనాభా ప్రాతిపదికన గిరిజనుల రిజర్వేషన్లను 6 నుంచి 10 శాతానికి పెంచాలని 2017లోనే తెలంగాణ అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్ర హోంశాఖకు పంపింది. బిల్లు తమ వద్దకు చేరిందని కేంద్ర హోంశాఖ కూడా అక్నాలెడ్జ్ చేసింది. కేంద్ర గిరిజన వ్యవహారాలశాఖ కూడా గిరిజనుల రిజర్వేషన్ల పెంపు ప్రతిపాదన అంశం కేంద్రం పరిశీలనలో ఉన్నదని రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన లేఖలో స్పష్టంగా చెప్పింది. ఇప్పుడేమో అసలు అలాంటి ప్రతిపాదనేదీ తమ వద్దకు రానేలేదని పార్లమెంట్‌లో దారుణంగా అబద్ధలాడింది. ఇదిలావుంటే టిఆర్ఎస్ ఎంపిలు నామా నాగేశ్వరరావు, కె కేశవరావు తదితరులు మాట్లాడుతూ కేంద్రం తీరు దారుణమన్నారు. అబద్దాలు చెప్పినందుకు సభావేదికగా మంత్రి క్షమాపణలు చెప్పాలన్నారు.

# షర్మిల పాదయాత్రలో అపశృతి

**తేనెటీగల దాడిలో పలువురికి గాయాలు**

**యాదాద్రి, మార్చి 23 (అక్షర వెలుగు):** వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల చేపట్టిన ప్రజాప్రస్థానం పాదయాత్రలో అపశృతి చోటు చేసుకుంది. ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. జిల్లాలోని మోట కొండూరు మండలం నుండి పాదయాత్రగా ఆత్మకూరు మండలానికి వెళ్తున్నక్రమంలోగ్రామస్తులతో మాట్లాడు తుండగా ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. అయితే అదృష్టవశాత్తు తేనెటీగల దాడి నుంచి షర్మిల బయటపడ్డారు.పలువురు కార్యకర్తలపై తేనెటీగలు దాడి చేశాయి. వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రజా ప్రస్థాన పాదయాత్ర 34వ రోజు కొనసాగుతోంది. ఈ పాదయాత్రలో భాగంగా తేనెటీగలు దాడి చేయడంతో ఎక్కడిక్కడ చెల్లా చెదురయ్యారు.

# పోచమ్మ దుర్గమ్మ బండ్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు



**మెదక్, అందోల్ మార్చి23 (అక్షర వెలుగు):** మెదక్ జిల్లా అందోల్ నియోజకవర్గం పరిధి టేక్మాల్ మండల కేంద్రంలో పోచమ్మ దుర్గమ్మ బండ్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు చుట్టుపక్కల గ్రామాల టేక్మాల్, గొల్లగూడం, ఎల్లంపల్లి గ్రామల ప్రజలు యువతి యువకులు పెద్దలు ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన భక్తులు శ్రీపోచమ్మ దుర్గామాత అమ్మవారి దీవెనలు పొందుతూ సుఖ సంతోషాలతో ఉంచాలని అందరినీ చల్లగా చూసే తల్లి పోచమ్మ దుర్గమ్మ ఈ పండుగ టేక్మాల్ లో ఎంతో ఘనంగా జాతర ఉత్సవాలు ప్రజలు ఆట పాటలతో డప్పు వాయిద్యాలతో ఈ జాతర ఉత్సవాలకు నిర్వహించారు. యస్ఐ బి.లింగం,తామా పోలీసు సిబ్బంది తో బందోబస్తు ఏర్పాటు చేసి చేసి ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు కార్యక్రమంలో సర్పంచ్ సుప్రజా భాస్కర్, ఉపసర్పంచ్ ప్రేమీల, గ్రామ నాయకులు భక్తుల వీరప్ప,నిమ్మ రమేష్, ఆకుల పాపయ్య ,సలీం,సిద్దయ్య,శివయ్య బాలయ్య, మాణిక్యం, గోవింద చారి, యాదయ్య, రాములు, కిషన్,అంజయ్య, వార్డు మెంబర్లు బీరప్ప సత్యం, ,గ్రామ పెద్దలు ప్రజలు యువతి యువకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు

# నిరుపేద కుటుంబాలకు ఏ కష్టం వచ్చినా ఆపద్బాంధవునిగా ఎల్లవేళల కృషి చేస్తాను

**శాసనసభ్యులు చంటి క్రాంతి కిరణ**



**మెదక్, అందోల్ మార్చి 23 (అక్షర వెలుగు):** మెదక్ జిల్లా అందోల్ నియోజకవర్గం పరిధి లో రేగోడు మండలం లో మట్టి నుండి పుట్టిన మనసున్న మారాజు పేద వారికి కష్టమొస్తే కొడుకు లాగా ముందు ఉంటూ అన్నా అంటే నేనున్నాను అంటూ ముందుకు వచ్చే నాయకుడు అందోల్ శాసనసభ్యులు చంటి క్రాంతి కిరణ్ నియోజకవర్గ ప్రజల సమస్యలు తెలిసిన అభిమన్యుడు కన్నీళ్లు తుడిచే అపార భగీరథుడు ప్రజా సేవే లక్ష్యంగా దళిత బహుజన అభివృద్ధి ధ్యేయంగా కళ్యాణలక్ష్మి చెక్కుల తోడుగా భగీరథుడు రాత్రనకా పగలనకా కళ్యాణ లక్ష్మీ చేతులతో తోడుగా ఉంటున్న అపర భగీరథుడు అందోల్ శాసనసభ్యులు చంటి క్రాంతి కిరణ్ అని నా నియోజక వర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటున్నారు. అని నియోజక ప్రజలు చెబుతున్నారు.

# రైతు పోరుకు సిద్ధం కావాలి



ములుగు, మార్చి 23 (అక్షర వెలుగు): ఏటూరునాగారం మండల కేంద్రంలో టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ యసంగిలో రైతులు పండించిన ధాన్యం ప్రతి గింజను కొనుగోలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రబుత్వం నీదే టీఆర్ఎస్ కార్యకర్తలు రైతుల పక్షాన వరి పోరుకు సిద్ధం కావాలి అని ములుగు జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ టీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కుసుమ జగదీష్ పిలుపునిచ్చారు పంజాబ్ ధాన్యం కొనుగోలు చేస్తున్న బీజేపీ కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర రైతుల ధాన్యం కూడా కొనుగోలు చెయ్యాలి అందరికి ఒకే న్యాయం ఉండాలి అన్నారు కేంద్రం ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసే వరకు టీఆర్ఎస్ కార్యకర్త వరి పోరు కు సిద్ధం కావాలి అని పిలుపునిచ్చారు ములుగు జిల్లా కేంద్రంలో 24 వ తేదీన లీల గార్డెన్ ఉదయం 10 గం.లకు వరి పోరు సన్నాహక సభ సమావేశనికి ముఖ్య అతిధిగా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి సత్యవతి రాథోడ్ గారు హాజరు అవుతున్నారు కనుక ఎంపీపీలు జడ్పీటీసీలు పిఎసియాస్ చైర్మన్లు మండల గ్రామ పార్టీ అధ్యక్షులు రైతు బంధు సమితి అధ్యక్షులు కో ఆప్షన్ సభ్యులు ముఖ్య నాయకులు సమావేశానికి హాజరు కావాలి జడ్పీ చైర్మన్ కుసుమ జగదీష్ తెలిపారు

# బొడ్రాయి ప్రతిష్టా తనకు విరాళాల వెల్లువ



ములుగు, మార్చి 23 (అక్షర వెలుగు): గోవిందరావుపేట మండల కేంద్రం లోని చల్వాయి గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ట తనకు విరాళాల వెల్లు వెత్తుతున్నటు బొడ్రాయి ప్రతిష్ఠాత్మక కమిటీ సభ్యులు తెలిపారు బుధవారం వారు మాట్లాడుతూ బొడ్రాయి ప్రతిష్టాపన లో చాపల ప్రతాపరెడ్డి అక్షరాల పదకొండు వేల నూట పదహారు రూపాయలు(11,116) మరియు తేళ్ల కిషోర్ ఆంజనేయ స్వామి వారికి తలుపులు దర్వాజల తో సహా అక్షరాల 25000 రూపాయలు బహూకరించడం జరిగింది అన్నారు ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తెల్ల హరి ప్రసాద్ వేల్పుగొండ పూర్ణచందర్ మేడిపల్లి మహేందర్ పడిదాల సాంబయ్య కంచర్ల బిక్షపతి తదితరులు పాల్గొనడం జరిగింది

# యాచారం మండల యువ మోర్చా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన బండ లింగం



**ఇబ్రహీంపట్నం, మార్చి 23 (అక్షర వెలుగు):** భారతీయ జనతా పార్టీ యువమోర్చ మండల కమిటీని బిజెపి మండల అధ్యక్షులు తాండ్ర రవీందర్ సమక్షంలో కలిసి ప్రకటించిన భారతీయ జనతా పార్టీ యువ మోర్చా అధ్యక్షులు భూతరాజు నాగరాజు, యాచారం మండల యువ మోర్చా ఉపాధ్యక్షులుగా బండ లింగం ను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా బండ లింగం మాట్లాడుతూ, నిరుద్యోగ సమస్యలను ఎప్పటికప్పుడు వెలికితీస్తూ మల్లొకసారి నిరుద్యోగులను మోసం చేయడానికి ప్రయత్నం చేయబోతున్న కేసీఆర్ ప్రభుత్వం పై పోరాటాలు చేస్తామని, మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన కెసిఆర్ కి తెలంగాణ రాష్ట్ర ప్రజలు తగు బుద్ధి చెప్తారని, దళితులకు 3 ఎకరాల భూమి , ఇంటికొక ఉద్యోగం ఇస్తానని హామీ ఇచ్చిన కేసీఆర్ నేటికీ నెరవేర్చుకోవడం సిగ్గుచేటన్నారు. నామమాత్రంగా పోస్టులు వేసి కేవలం పోలీస్ ఉద్యోగాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని నిరుద్యోగుల మీద కెసిఆర్ కి చిత్తశుద్ధి ఉంటే అందర్నీ కలుపుకుపోయే విధంగా ఉండేవారని మండిపడ్డారు. ఈ సందర్భంగా నా మీద నమ్మకంతో ఇచ్చిన ఈ పదవిని ప్రజల కోసం ఎల్లప్పుడూ పని చేస్తానని ,నాకు పదవి కట్టబెట్టిన అధ్యక్షులకు అందుబాటులో ఉండి పని చేస్తానని వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# జిల్లాలో క్షయవ్యాధిని సమూలంగా నిర్మూలిద్దాం

### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జువేరియా



**కరీంనగర్, మార్చి 24 (అక్షర వెలుగు):** ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడారు. క్షయ వ్యాధి (టిబి) లక్షణాలను సులభంగా గుర్తించవచ్చునని తెలిపారు. రెండు వారాలకు మించి దగ్గు ఉండడం, సాయంత్రం పూట జ్వరం రావడం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, ఛాతిలో నొప్పి, తెమడలో రక్తం చారలు కనబడడం క్షయ వ్యాధి లక్షణాలని పేర్కొన్నారు. తెమడ పరీక్ష లేదా ఎక్స్ రే ద్వారా క్షయ వ్యాధిని నిర్ధారించవచ్చునని తెలిపారు. క్షయ వ్యాధి పరీక్షలను జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి తో పాటు అన్ని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా చేస్తారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పేర్కొన్నారు. ఈ వ్యాధిని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరీక్షలు చేసుకుని మందులు వాడితే క్షయ వ్యాధిని సమూలంగా నిర్మూలించవచ్చని తెలిపారు. క్షయ వ్యాధి నిర్ధారణ జరిగితే వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు ఇవ్వడంతోపాటు ప్రతి నెల రూ. 500 ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. క్షయ వ్యాధి ప్రమాదకరం కానప్పటికీ, క్షయ వ్యాధిని తేలికగా తీసుకోకూడదని అన్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ జరిగితే సుమారు ఆరు నెలల వరకు మందులు వాడాలని తెలిపారు. వ్యాధిగ్రస్తులు ఉన్న కుటుంబంలోని వారందరికి కూడా క్షయ వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్తగా ఆరు నెలల పాటు ఉచితంగా మందులు అందజేస్తామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి తెలిపారు. క్షయ వ్యాధి ముదిరిన వారికి (మొండి వ్యాధిగ్రస్తులకు) కూడా ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచిత చికిత్స లభిస్తుందని వివరించారు. క్షయ వ్యాధి సోకకుండా పుట్టిన పిల్లలకు బిసిజి వ్యాక్సినేషన్ తప్పనిసరిగా ఇప్పించాలని తెలిపారు. జిల్లా క్షయ వ్యాధి అధికారి డాక్టర్ రవీందర్ మాట్లాడుతూ జిల్లాలో 2020 -2021 సంవత్సరం లో 1122 క్షయ వ్యాధి కేసులను గుర్తించామని తెలిపారు. 2021- 2022 సంవత్సరంలో 287 క్షయ వ్యాధి కేసులను గుర్తించామని, వీరందరికీ చికిత్స అందించామని తెలిపారు. కోవిడ్ కారణంగా క్షయ వ్యాధి కొంత తగ్గుముఖం పట్టిందని పేర్కొన్నారు. విధిగా మాస్కులు ధరించడం కారోన పరీక్షలు చేయించుకోవడం, మందులు వాడటం వల్ల క్షయ వ్యాధి కేసులు తగ్గాయని తెలిపారు. క్షయ వ్యాధి లక్షణాలు కనబడితే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకొని మందులు వాడాలని సూచించారు. క్షయ వ్యాధిని నిర్లక్ష్యం చేయవద్దని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుధాకర్ రెడ్డి, డాక్టర్ ఎం. విప్లవ శ్రీ తదితరులు పాల్గొన్నారు.

# చదువుల తల్లికి రేగా విష్ణు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ

### విప్, పినపాక శాసనసభ్యులు రేగా కాంతారావు అండ...





**భద్రాద్రి కొత్తగూడెం, పినపాక, మార్చి 23 (అక్షర వెలుగు):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చర్ల మండల కేంద్రంలోని విజయ్ కాలనీ చెందిన మత్తె దుర్గారావుదిమాధవి ల ప్రథమ పుత్రిక మత్తె కళ్యాణి ఇటీవల జరిగిన నీట్ పరీక్షలలో 503 మార్కులతో 1763వ ర్యాంకు సాధించి, ఎంబీబీఎస్ సీటుకు ఎంపిక అయింది, ఆమె ఫీజు చెల్లించే పరిస్థితిలో లేరు ఈ విషయం తన దృష్టికి వచ్చిన వెంటనే స్పందించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ పినపాక శాసనసభ్యులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు రేగా విష్ణు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తన వంతు గా చదువు పూర్తయ్యే వరకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. విద్యార్థుతోపాటు వారి కుటుంబ సభ్యులను ఘనంగా శాలువాతో సన్మానించడం జరిగింది. కడు పేదరికంలో అనేక సవాళ్లు దాటుకొని ఎం బి బి ఎస్ సీటు సాధించిన మత్తె కళ్యాణి లక్షలాది మందికి స్ఫూర్తిగా నిలుస్తుందని రేగా కాంతారావు పేర్కొన్నారు. కృషితో ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించవచ్చునే ఈ విషయాన్ని కళ్యాణి నిరూపించిందని పేర్కొన్నారు. భవిష్యత్తులో అండగా ఉంటానని హామీ ఇచ్చారు, ఎంబిబిఎస్ లోనూ ప్రతిభ చాటాలని ఆశీర్వదించారు, అండగా నిలిచిన ప్రభుత్వ విప్ పినపాక శాసనసభ్యులు టిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు కి వారి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

# ముఖ్యమంత్రి కేసీఆర్ కు పాలాభిషేక




**నాగార్జునసాగర్, మార్చి 23 (అక్షర వెలుగు):** మహాత్మ జ్యోతిబాపూలే గురుకులాల విద్యా సంస్థలలో పనిచేస్తున్న అతిధి ఉపాధ్యాయుల వేతనాలు పెంచినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ బుధ వారము నాగార్జునసాగర్ గురుకుల పాఠశాల లో అతిధి ఉపాధ్యాయుల సంఘం నాయకుడు కుక్కడాల మల్లికార్జున్ రావు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ , బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ ,బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ,సెక్రటరీ శ్రీ మల్లయ్య బట్టు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో అతిథి ఉపాధ్యాయులు శర్మ, మల్లికార్జున రావు, సైదులు, వీరబాబు, శ్రీనివాస రావు, రాజశేఖర్ రెడ్డి, ఖాను,సత్యవతి, సరళ ,నూర్జహాన్ స్వాతి, శ్రావణి పీ. ఈ టీ లు నరసింహ జానకిరామ్ పాల్గొన్నారు.

# అర్ధరాత్రి ఆపరేషన్ చబుత్ర చేపట్టి జులాయి గా తిరుగుతున్న ఆకతాయిలపై కొరడా జులిపించిన 1టౌన్, ఎన్టీపీసీ పోలీసులు

### రాత్రి 10 గంటల తరువాత అనవసరంగా రోడ్లపై తిరిగితే కఠిన చర్యలు: ఏసీపీ గిరిప్రసాద్



**పెద్దపల్లి, మార్చి 23(అక్షర వెలుగు):** ఆపరేషన్ చబుత్ర లో భాగంగా రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు గోదావరిఖని ఏసీపీ గిరిప్రసాద్ అదేసానుసారం 1టౌన్ సీఐ రమేష్ బాబు, రామగుండం సీఐ లక్ష్మి నారాయణ ఆధ్వర్యంలో రాత్రి 10.00 గంటలకు ప్రతి గల్లీలో, ప్రతి ఏరియాలో ఆర్టీసీ బస్టాండ్, ఎన్టీపీసీ, అన్నపూర్ణ కాలనీ, కృష్ణ నగర్ ఇతర ప్రాంతాలలో లో రాత్రి 10 గంటల తరువాత రోడ్లపై అనవసరంగా తిరిగుతు, ద్విచక్ర వాహనాల సైలెన్సర్ల సౌండ్ పెంచుతూ, ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా గల్లీలో తిరుగుతున్నా వారిని, ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న వారిని, మద్యం సేవించి న వారిని పట్టుకున్నారు వారిపై ఏమైనా నేరచరిత్ర ఉన్నాయ లేదా అని తెలుసుకోవడానికి మొబైల్ ఫింగర్ ప్రింట్స్ చెక్ డివైజ్ తో చెక్ చేయడం జరిగింది. అలాగే అర్ధరాత్రి గల్లీలో మద్యం సేవించి ద్విచక్ర వాహనల పై తిరుగుతు జులాయి గా తిరుగుతూన్న వారిపై కేసులు నమోదు చేసి 1టౌన్ పోలీస్ స్టేషన్, ఎన్టీపీసీ కి తరలించి కౌన్సిలింగ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏసీపీ గిరి ప్రసాద్ మాట్లాడుతూ...అసాంఘిక కార్యక్రమాలకు ఎవరూ పాల్పడవద్దని, ముఖ్యంగా యువకులు పోకిరీలుగా అవతారం ఎత్తి తమ భవిష్యత్ను నాశనం చేసుకోవద్దని ఏసీపీ సూచించారు. అంతేకాకుండా చెడు వ్యసనాలకు అలవాటు పడే అవకాశం ఉన్నదని, తల్లిదండ్రులు పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ రోజు నుండి స్పెషల్ డ్రైవ్ లు నిర్వహించడం జరుగుతుంది అని రాత్రి సమయంలోఎవరైనా యువకులు రోడ్లపై విన్యాసాలు చేస్తూ, గుంపులుగా కనబడితే వారిని అరెస్ట్ చేసి వాహనాలను సీజ్ చేస్తామన్నా రు. యువకులు ఇప్పటినుంచే, చట్టవ్యతిరేకమైన, నేరాల్లో పాల్గొంటే భవిష్యత్ ఉండదని యువకులకు సూచించారు. ప్రతి రోజు రాత్రి 10 గంటలలోపే పని ముగించుకొని ఎవరి ఇండ్లలో వారు ఉండాలి అలా కాకుండా అనవసరంగా రోడ్లపై మద్యం సేవిస్తూ గల్లీలో తిరుగుతూ, పోకిరి చేష్టలు చేసేవారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఏసీపీ హెచ్చరించారు. ఇట్టి కార్యక్రమంలో సిఐలు 2టౌన్ శ్రీనివాసరావు, రామగుండం సిఐ లక్ష్మి నారాయణ, సయ్యద్ అఫ్జలొద్దిన్, ఎస్సైలు రమేష్, స్వామి, నరేష్ కుమార్, శైలజ, అంతర్గం ఎస్ఐ శ్రీధర్,ఎన్టీపీసీ ఎస్ఐ కుమార్ కళాధర్ రెడ్డి,మరియు ఏఎస్సైలు,40 మంది కానిస్టేబుల్స్ సిబ్బంది,

# అధికార పార్టీ నాయకుల ప్రభుత్వ శిఖం భూముల కబ్జా, అక్రమ నిర్మాణాలపై జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డా.కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకులు



**కరీంనగర్, మార్చి 23 (అక్షర వెలుగు):** మానకొండూర్ నియోజకవర్గం తిమ్మాపూర్ మండలం తిమ్మాపూర్ గ్రామ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ శిఖం భూములు సర్వే నెం 447లో 19-09 ఎకరాలు సర్వే నెం 287లో 10-37ఎకరాలు సర్వే నెం 15లో 4-14ఎకరాల భూమిని మానకొండూర్ ఎమ్మెల్యే అనుచరులు అధికార పార్టీ నాయకులు భూములను ఆక్రమించి ఎలాంటి పంచాయతీ అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టి ప్రభుత్వ నిధులతో మట్టి పోసి సీసీ రోడ్స్ నిర్మాణం చేసి అమాయక ప్రజలకు అమ్మి మోసం చేస్తున్నారు కావున అట్టి భూమిని సర్వే జరిపించి అందులో చేపట్టిన నిర్మాణాలను తొలగించి కబ్జాదారుల నుండి భూమిని కాపాడి వారిపై చర్యలు తీసుకొవాలని డిమాండ్ చేస్తూ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డా.కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ని కలిసి పిర్యాదు చేయడం జరిగింది. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షులు మడుపు మోహన్ తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు మోరపల్లి రమణారెడ్డి,పొలంపల్లి ఎంపీటీసీ బండారి రమేష్,మాజీ సర్పంచ్లు బుడిగే కొండయ్య,గంకిడి లక్ష్మారెడ్డి,నాయకులు గవ్వ రాజేందర్ రెడ్డి,లింగమూర్తి,మోహన్, ఆశిక్ పాషా తదితరులు పాల్గొన్నారు

# పాము కాటుకు గురై విద్యుత్ సబ్ స్టేషన్‌లో లైన్ ఇన్స్పెక్టర్ మృతి



**భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 23 (అక్షర వెలుగు):** కరకగూడెం మండలం... కరకగూడెం విద్యుత్ సబ్ స్టేషన్ లో లైన్ ఇన్స్పెక్టర్ విధులు నిర్వహిస్తున్న, నాగరాజు (42 ) పాము కాటుకు గురై మృతి చెందాడు. స్థానికులు, ప్రత్యక్ష సాక్షులు, కరకగూడెం ఎస్ఐ జీ. ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగరాజు బుధవారం సాయంత్రం విధులు ముగించుకొని ఇంటికి వెళ్ళిన అనంతరం రాత్రి సమయంలో నిద్రకు ఉపక్రమించాడు. గురువారం తెల్లవారుజామున నాగరాజు మేల్కొనకపోవడంతో చుట్టుపక్కల వారు నాగరాజు లేపే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో నాగరాజు నిద్రిస్తున్న గదికి గడప సమీపంలో రిఫీట్స్ ల పెద్ద తాచుపాము పడుకొని ఉండడం గమనించారు. గ్రామస్తుల అలజడికి పాము పారిపోయినట్లు తెలియవచ్చింది. అనంతరం నాగరాజు ని పరిశీలించగా...నోటి నుండి బురుజు కక్కుకొని నిర్జీవంగా పడి ఉన్నాడు. సంఘటన ప్రదేశంలో తాచుపాము కనిపించడంతో పాము కాటుకు గురై మృతి చెంది ఉంటాడని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నాగరాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మణుగూరు తరలించారు. మృతుడుది పాల్వంచ మండలం బొల్లేరుగూడెం గ్రామవాసి. మృతుడికి భార్య కమల ఉన్నారు. సహచర ఉద్యోగి అకాల మృతి పట్ల కరకగూడెం సబ్ స్టేషన్ సిబ్బంది తీవ్ర విషాదం లో మునిగిపోయారు.

# జమియతుల్ హుఫ్ఫాజ్ సేవలు అభినందనీయం..

### జిల్లా ఆసుపత్రి ఆర్ఎంవో మంజుల



**కరీంనగర్, మార్చి 24 (అక్షర వెలుగు):** జమియత్ ఉల్ హుఫ్ఫాజ్ సేవలు అభినందనీయమని కరీంనగర్ జిల్లా ఆసుపత్రి ఆర్ఎంవో మంజుల అన్నారు. బుధవారం జమియతుల్ హుఫ్ఫాజ్ ఆధ్వర్యంలో మాతా శిశు ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఇంజనీర్ కోల అన్నారెడ్డి తో కలిసి ఆర్ఎంవో ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా వేసవిని పురస్కరించుకొని మాతా శిశు ఆసుపత్రిలో ప్రసూతి కోసం వచ్చే పేషెంట్లకు, వారి బంధువులకు కుల, మతలకతీతంగా, మానవ సేవే ప్రామాణికంగా ఉచితంగా చల్లని త్రాగునీరు అందించడం చాలా పుణ్య ప్రదమైన విషయమన్నారు. సేవా గుణానికి చిరునామా గా బాటసారులకు, ప్రయాణికులకు జమియతుల్ హుఫ్ఫాజ్ సేవలు అందించడం హర్షణీయమన్నారు. మౌలానా సయ్యద్ అహ్మద్, ముయేజ్ నద్వీ దుఆ చేశారు. ఈ కార్యక్రమంలో జమియతుల్ ఉలేమా జిల్లా ముఫ్తీ మహమ్మద్ యూనిస్ ఖాస్మి, ముఫ్తీ సాదిక్ హుస్సేన్ ఖాస్మీ, జమియతుల్ హుఫ్ఫాజ్ ఉపాధ్యక్షుడు హఫీజ్ జియావుల్లా ఖాన్, కార్యదర్శి హఫీజ్ ముహమ్మద్ వసీమ్ఉద్దీన్, కోశాధికారి హఫీజ్ మొజ్జామ్ హుస్సేన్, హఫీజ్ రిజ్వాన్, హఫీజ్ ఫరీదోద్దీన్ అమ్జద్, హఫీజ్ ఇస్మాయిల్ రషీద్, హఫీజ్ జకీర్ జలీల్ తదితరులు పాల్గొన్నారు.

# నెహ్రూ జూలాజికల్ పార్క్‌లోని అధికారులు జంతువులను హీట్‌వేవ్ నుండి రక్షణ



**హైదరాబాద్, మార్చి 23(అక్షర వెలుగు):**..వేసవి కాలం ప్రారంభమైనందున, నెహ్రూ జూలాజికల్ పార్క్‌లోని అధికారులు జంతువులను హీట్‌వేవ్ నుండి రక్షించడానికి చొరవ తీసుకుంటున్నారు. గత వారం రోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో, జూ జంతువులను హీట్‌స్ట్రోక్ మరియు డీ-హైడ్రేషన్ నుండి నిరోధించే ప్రయత్నాలను విస్తరించింది. సమస్యలు. జంతువులను వేడి తరంగాల నుండి రక్షించే ప్రక్రియ ప్రతి సంవత్సరం మార్చి ప్రారంభంలో ప్రారంభించబడుతుంది.మాంసాహార జంతువులు మరియు కోతుల ఆవరణలో ఎయిర్ కూలర్‌లను ఉంచారు. ఇది కాకుండా, పులులకు ఖాకాష్ థాటీస్ (గన్నీ బ్యాగ్‌లు) మరియు తుంగా గడ్డిని అందజేస్తారు. సరీసృపాలు మరియు పక్షుల ఆవరణలలో పొగమంచు జల్లులు ఉన్నాయి. జంతువులను హైడ్రేటెడ్‌గా ఉంచడానికి నీటితో పాటు గ్లూకోజ్‌ను కూడా అందజేస్తున్నారు. జూ అధికారులు జంతువులను పోషించడానికి పుచ్చకాయ మరియు కస్తూరి పుచ్చకాయలు వంటి సిట్రస్ పండ్లను కూడా పండించడం ప్రారంభించారు. పక్షుల ఎన్‌క్లోజర్‌లలోకి ప్రవేశించే వేడిని తగ్గించడానికి ఆకుపచ్చ వలలతో కప్పబడి ఉంటుంది. ఎలిఫెంట్ ఎన్‌క్లోజర్‌లలో వాటిని వేడి నుండి రక్షించడానికి జల్లులు వేయబడ్డాయి.

# బాధిత కుటుంబానికి ఆర్థికసహాయం అందజేసిన యువత



**భద్రాద్రి కొత్తగూడెం, మార్చి23 (అక్షర వెలుగు):** బుధ వారం బూర్గంపాడు మండలం పరిధిలోని మొరంపల్లి బంజర్ గ్రామానికి చెందిన ఓ యువకుడు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలవగా అదే గ్రామానికి చెందిన కొందరు యువకులు ఆ బాధిత కుటుంబానికి బాసటగా నిలిచారు గ్రామానికి చెందిన బొజ్జ ఆది నారాయణ ఈనెల 16 న పని నిమిత్తం కొత్తగూడెం వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో పాల్వంచ వద్ద ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు అతను వైద్యానికి ఐదు లక్షల రూపాయలు నుండి రూ పది లక్షల రూపాయలు వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. రెక్కాడితే కానీ డొక్కాడని ఆ కుటుంబం ఏం చేయాలో తెలియక దాతల సహాయం కోరారు. ఈక్రమంలో మొరంపల్లిబంజార కు చెందిన కొందరు యువకులు ఆదినారాయణ ను కాపాడుకునేందుకు అనుకున్నది తడవుగా వాట్సాప్ (సామాజిక మధ్యమం) గ్రూప్ క్రియేట్ చేసి సహాయం కోరారు తోటి మిత్రులు దాతలు ముప్పై ఆరు వేల నాలుగు వందలు వరకు సేకరించి ఆ మొత్తాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. మరి కొందరు దాతలు మిత్రులు ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో రాజు అన్వేష్ బత్తిన. కరీముల్లా బాబు ఎం. రామారావు బండారి. మహేష్ జె. సంతోష్ బండారి. సంపత్ సర్వేష్ రెడ్డి తో పాటు బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# మణుగూరు మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీస్ అందజేసిన ఐ.ఎఫ్.టి.యు



**భద్రాద్రి కొత్తగూడెం, మార్చి23 (అక్షర వెలుగు):** తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఐ.ఎఫ్.టి.యు. మణుగూరు బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో ఈరోజు మణుగూరు మున్సిపల్ కమిషనర్‌కు సమ్మెనోటీస్ అందజేశారు అనంతరం ఐ.ఎఫ్.టి.యు జిలా ఉపాధ్యక్షులు ఆర్.మధు సూదన్ రెడ్డి మాట్లాడుతూ మోడీ పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానం లో నాలుగు లేబర్ కోడ్ ల తెచ్చాడని దీనివల్ల కార్మిక రంగానికి కొత్త హక్కులు రాకపోగా ఉన్న హక్కులు కూడా ఊడ కొడుతున్నాడని, అత్యంత ప్రమాదకరమైన ఈ నాలుగు లేబర్ కోడ్ లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.చాయ్ వాలా దేశానికి ప్రధాని అయితే దేశంలో అందరూ సుభిక్షంగా ఉండాలని నమ్మి ఓట్లు వేసి గెలిపిస్తే మోడీ అచ్చేదిన్ పేరుతోటి దేశంలోఉన్న ప్రభుత్వ రంగ సంస్థల అన్నింటిని ఒక్కొక్కటిగా ప్రైవేటు పరంచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు రైతు చట్టాలకు వ్యతిరేకంగా రైతులు దేశవ్యాప్తంగా సంవత్సరం పాటు చట్టాలకు వ్యతిరేకంగా పోరాడి చట్టాలను రద్దు చేయించుకున్నారు అని రైతుల స్ఫూర్తితో కార్మి కులు 4 లెబర్ కోడ్ లకు వ్యతిరేకంగా పోరాడలన్నారు. ఈ నెల 28 29 తేదీలలో జరుగు దేశవ్యాప్త సమ్మెలో ప్రతి కార్మికుడు సమ్మెలో పాల్గొని కార్మిక సత్తా చాటాలని పిలుపు నిచ్చారు. అదేవిధంగా జీవో నెంబర్ 60 ప్రకారం జిల్లాలోని పాల్వంచ, కొత్తగూడెం, ఇల్లందు మున్సిపాలిటీలలో పెరిగిన వేతనాలు అమలవుతుండగా మణుగూరు లో మాత్రం అమలు కావడం లేదని విమర్శించారు. మణుగూరు మున్సిపల్ కార్మికులకు కూడా పెరిగిన వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐ.ఎఫ్.టి.యు మణుగూరు ఏరియా నాయకులు ఎండీ.గౌస్, తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మణుగూరు బ్రాంచ్ కార్యదర్శి మిట్టపల్లి రాజేందర్, కార్మికులు నర్సింహ, సతీష్, లక్ష్మీనారాయణ, ప్రవీణ్, కార్తీక్, సరస్వతి, రమాదేవి, సాయమ్మ, పోచమ్మ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు ఐఎస్ఓ సర్టిఫికెట్ రావడం అభినందనీయం

### కెడిసిసి బ్యాంక్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు



**కరీంనగర్, మార్చి 23 (అక్షర వెలుగు):** కరీంనగర్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు కు ఐఎస్ఓ సర్టిఫికేషన్ రావడం అభినందనీయమని, ఇది బ్యాంకు పనితీరుకు నిదర్శనమని బ్యాంక్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు అన్నారు. బుధవారం కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ కార్యాలయంలో నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో బ్యాంక్ చైర్మన్ కొండూరు రవీంద్రరావు మాట్లాడారు. సహకార బ్యాంకులు దేశంలోనే మొదటి స్థానంలో నిలిచాయని, ఇది శుభ పరిణామం అని తెలిపారు. కరోనా నేపథ్యంలో కూడా సహకార బ్యాంకులు రైతాంగానికి విశిష్ట సేవలు అందించాయని గుర్తు చేశారు. ఉద్యోగ నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన బ్యాంకు సిబ్బందికి నివాళులర్పించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అధ్యక్షులకు వేతనం పెంపు చేయుటకు ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని అన్నారు. ఇందుకుగాను కమిటీ ఏర్పాటు చేశారని తెలిపారు. సహకార సంఘాల సిబ్బందికి నిర్దిష్టమైన పాలసీ, ఉద్యోగ భద్రత లేదని అన్నారు. ఉద్యోగ భద్రత, నిర్దిష్టమైన పాలసీ అమలు చేసేందుకు కమిటీ చొరవ తీసుకుంటుందని తెలిపారు. బ్యాంకు సిబ్బందికి కేటగిరీల వారీగా హెచ్ ఆర్ పాలసీ అమలుజేస్తారని అన్నారు. సంఘాలను నాలుగు కేటగిరీలుగా విభజించారని, కేటగిరీల వారీగా సంఘాల అధ్యక్షులకు గౌరవ వేతనం అందుతుందని కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు పేర్కొన్నారు. కేంద్ర సహకార బ్యాంకులు స్వంత భవనాలు కలిగి ఉండడం తో పాటు సోలార్ వ్యవస్థలు కలిగి ఉన్నాయని అన్నారు. సహకార బ్యాంకులు, వ్యవసాయ సహకార సంఘాలు రోల్ మోడల్ గా మారుతున్నాయని తెలిపారు. కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ను చత్తీస్ ఘడ్, బీహార్ రాష్ట్రాల ప్రతినిధులు సందర్శించారని తెలిపారు. అనంతరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అధ్యక్షులకు గౌరవ వేతనం పెంపునకు నిర్ణయించిన రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సమావేశంలో జిల్లా సహకార అధికారి శ్రీమాల, కేడి సి సి బ్యాంక్ సీఈవో సత్య నారాయణ, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# కమ్యూనికేషన్ సెల్ కార్యక్రమాలను విజయవంతం చేయాలి



**మందమర్రి, మార్చి 23 (అక్షర వెలుగు):** ఏరియాలో కమ్యూనికేషన్ సెల్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఫైనాన్స్ (ప్రాజెక్ట్స్) అండ్ ప్లానింగ్ డైరెక్టర్ ఎన్. బలరాం జీఎం సిడిఎన్ అండ్ సిపిఅర్ఓ కే సూర్యనారాయణ లు పేర్కొన్నారు. కమ్యూనికేషన్ సెల్ అండ్ సేవ 2021, 22 లో అన్ని ఏరియాలలో చేసిన కార్యక్రమాలను డైరెక్టర్ ప్రశంసించారు. బుధవారం మందమర్రి జనరల్ మేనేజర్ కార్యాలయంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్ వరప్రసాద్ పాల్గొన్నారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ, 2022-23 లో సేవ , కమ్యూనికేషన్ సెల్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని అన్నారు. ఏరియాలలో కోఆర్డినేటర్లు చేస్తున్న పనిని అభినందించారు. అలాగే సింగరేణిలో షార్ట్ ఫిలిం పోటీలలో మొదటి, రెండవ బహుమతి గెలుచుకున్న మందమర్రి ఏరియా డైరెక్టర్ డి. వెంకటేష్ , నిర్మాత, యాక్టర్ ఇ. రాజేశ్వర్, శ్రీకాంత్ లను హైదరాబాద్ సింగరేణి భవన్ లో డైరెక్టర్ బలరాం. జిఎం సిడిఎన్ సూర్యనారాయణ లు క్యాష్ ప్రైజ్ తో పాటు మెమెంటోలను అందించి అభినందించారు. అదేవిధంగా వచ్చే నెలలో పదవీ విరమణ పొందబోతున్న కమ్యూనికేషన్ సెల్ చీఫ్ కోఆర్డినేటర్ ఘన శంకర్ పూజారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమలను అన్ని ఏరియాల అధికారులు వీడియో కాన్ఫరెన్స్ లో వీక్షించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పిఓ సత్యబోస్, అన్ని గనుల సంక్షేమ అధికారులు, కమ్యూనికేషన్, సేవా కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ విద్యార్థి సుమహర్షిణిని అభినందించిన ఏరియా జిఎం



**మందమర్రి, మార్చి 23 (అక్షర వెలుగు):** మందమర్రి పట్టణంలోని అంగడిబజార్ ప్రాంతానికి చెందిన సింగరేణి కార్మికుడు సామంతుల స్వామి , సౌజన్య దంపతుల కుమార్తె సామంతుల సుమహర్షిణి హైదరాబాద్ జెఎన్టీయు 10వ స్నాతకోత్సవంలో ఉత్తమ విద్యార్థినిగా రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతులు మీదుగా పురస్కారం అందుకోగా, సింగరేణి సంస్థ మందమర్రి ఏరియా జిఎం చింతల శ్రీనివాస్ బుధవారం ఏరియా జిఎం కార్యాలయంలో సుమహర్షిణికి పుష్పగుచ్ఛం అందించి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇదేవిధంగా సుమహర్షిణి మరిన్ని ఉన్నత చదువులు చదివి, తల్లిదండ్రులకు, సింగరేణి సంస్థకు, మందమర్రి పట్టణానికి మంచి పేరు తీసుకురావాలన్నారు.ఈ కార్యక్రమంలో సుమహర్షిణి తల్లిదండ్రులు సామంతుల స్వామి, సౌజన్య, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షులు మేడిపల్లి సంపత్, సింగరేణి ఉన్నతాధికారులు, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణ దీక్షను విజయవంతం చేయండి



**మందమర్రి, మార్చి 23 (అక్షర వెలుగు):** రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తున్న అగ్రవర్ణాల కుట్రలను నిలువరించేందుకు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మార్చి 25న హైదరాబాద్ లో ఇందిరా పార్కు వద్ద నిర్వహించు రాజ్యాంగ పరరక్షణ దీక్షను విజయవంతం చేయాలని మాల మహానాడు నాయకులు మొయ్య రాంబాబు పిలుపు నిచ్చారు. బుధవారం మందమర్రి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మాలమహానాడు ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు.

## ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం



**మందమర్రి, మార్చి 23 (అక్షర వెలుగు):** మందమర్రి మండలం పరిధిలోని గ్రామీణ ప్రాంతం లో ఉపాధి హామీ పథకంలో 2018-19 సంవత్సరంలో 100 రోజులు పని దినాలు పూర్తి చేసిన కుటుంబం నుంచి 18నుండి 45సంవత్సరాల మధ్య వయస్సు గల గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతి యువకులుకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డిఆర్డిఏ) ఆధ్వర్యంలో ఉచిత వృత్తి శిక్షణ అందించడం జరుగుతుందని ఉపాధి హామీ ఏపీవో రజియా సుల్తానా పేర్కొన్నారు. బుధవారం ఎంపిడివో కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులకు స్థిరమైన ఉపాధి కల్పించడం కొరకు డిఆర్డిఎ ఆధ్వర్యంలో ఎంప్లాయిమెంట్ జనరేషన్ మార్కెటింగ్ మిషన్ సంస్థను ఏర్పాటు జరిగిందని, ఉన్నతి పథకంలో భాగంగా హైదరాబాద్, జగిత్యాల, మంచిర్యాల, బెల్లంపల్లి తదితర పట్టణాలలో యువతీ యువకులను శిక్షణ కేంద్రం వద్దకు తరలించడంతోపాటు,వివిధ వృత్తి విద్యాలో ఉచిత శిక్షణ, హాస్టల్ వసతి సౌకర్యం కల్పించడం జరుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు గ్రామీణ ప్రాంతాల్లో మహిళ సమాఖ్య ఆర్పిలను, పంచాయతీ కార్యదర్శులను, ఎంపిడివో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

## పార్లమెంట్లో గిరిజన బిల్లును వెంటనే ఆమోదించాలని నిరసన



**అందోల్, మార్చి 23 (అక్షర వెలుగు):** ఎస్ టి బిల్లు కు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న తీరును నిరసిస్తూ బుధ వారం అందోల్ ఎం ఎల్ ఏ క్యాంపు కార్యాలయం ముందు పెద్ద ఎత్తున అందోల్ నియోజకవర్గానికి చెందిన టేక్మాల్ గిరిజన నాయకులు మరియు ప్రజలు బిజెపి దిష్టి బొమ్మ ను దహనం చేసి నిరసన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా చంద్రు తండా సర్పంచ్ రమావత్ స్రవంతి సర్ధార్ మాట్లాడుతూ మరియు రమేష్ నాయక్ చౌహన్ బంజారా సేవాలాల్ సంఘం మెదక్ జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా మేలుకొని గిరిజన సంక్షేమం కొరకై తెలంగాణ ప్రభుత్వం శాసన సభ లో ప్రవేశపెట్టిన బిల్లు ను వెంటనే ఆమోదించాలని లేదంటే గిరిజన తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి ఉంటుందని, పేర్కొన్నారు అవసరమైతే దేశం లో వున్న అందరు గిరిజనులు అందరు ఏకమై బిజెపీ కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించడానికి కూడ వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రమేష్ నాయక్ చౌహన్ బంజారా సేవాలాల్ సంఘం మెదక్ జిల్లా అధ్యక్షులు రామావత్ స్రవంతి సర్ధార్ సర్పంచ్ చంద్రు తండా రామావత్ కిషన్ షాబాద్ సర్పంచ్ చాంప్లా నాయక్ ఏ ఎం సి డైరెక్టర్ సుశీల జై సింగ్ ఎం పి టీ సి లక్ష్మి సాగర్ లకావత్ మోహన్ ఎం పి టీ సి ఏలకుర్తి జెరప్ల రాజు నాయక్ సర్మోని కుంట తండా సర్పంచ్ నేనావత్ చంద్ర శేఖర్ వసంత్ రావు వినోద్ తదితరులు పాల్గొన్నారు

## ఏస్కూరి మరణం నేతకాని మహార్ జాతికి తీరని లోటు



**మంచిర్యాల, మార్చి 23 (అక్షర వెలుగు):** నేతకాని మహార్ హక్కుల పరిరక్షణ సంఘం స్టీరింగ్ కమిటీ వైస్ చైర్మన్ ఏస్కూరి జ్ఞానానందం మరణం నేతకాని జాతికి తీరనిలోటని సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకులు దుర్గం నగేష్ అన్నారు. ఈ మేరకు ఆదివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన జ్ఞానానందం ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో నేతకాని మహార్ సంఘం సీనియర్ నాయకులతో కలసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డాక్టర్ అంబేద్కర్ పూర్తితో పే బ్యాక్ టుద సొసైటీ నినాదంతో ఏస్కూరి జ్ఞానానందం నేతకాని దళితులు ఆర్థికంగా రాజకీయంగా సామాజికంగా అభివృద్ధి చెందాలని అహర్నిశలు కృషి చేశారని తెలిపారు. దళితుల అభివృద్ధి కోసం జ్ఞానానందం ఆశయ సాధన కోసం నేతకాని మహర్ లంతా కృషి చేయాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పాగే భూమయ్య, జాడీ అన్నారావు, నేతకాని మహర్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దుర్గం గోపాల్, నేతకాని మహర్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దర్శనాల భువనచంద్ర, రాష్ట్ర నాయకులు ఏస్కూరి రాయమల్లు, ప్రభాకర్, గవ్వలు శ్రీకాంత్, జాడి ప్రేమ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ అందించిన స్ఫూర్తితో యువత మేల్కోవాలి, ఈ పాలక ప్రభుత్వాలకు చరమగీతం పాడాలి


ఎంసిపిఐయు జిల్లా కార్యదర్శి సబ్బనికృష్ణ పిలుపు




**మంచిర్యాల, మార్చి 23 (అక్షర వెలుగు):** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని ఎంసిపీఐయు పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శి సబ్బని కృష్ణ భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి 91వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, భరతమాత దాస్యశృంఖలాలను బద్దలు కొట్టడానికి, బ్రిటిష్ వాళ్లను ఈ దేశం నుండి వెళ్ళకొట్టడానికి నూనూగు మీసాల చిన్న వయసులోనే రాజ్ గురు, సుఖ్ దేవ్ లతో కలిసి బ్రిటిష్ పార్లమెంట్ పైన బాంబులు వేసి చిరునవ్వులు చిందిస్తూ ఉరికొయ్యలను ముద్దాడుతూ ఇంక్విలాబ్ నినాదాన్ని ఈ దేశ యువతకు, ప్రజలకు అందించి యువతను విప్లవబాటలో పయనించాలని, బానిసత్వాన్ని ఎదిరించాలని, బ్రిటిష్ వాళ్లను ఈ దేశం నుండి పారద్రోలే వరకు విశ్రమించొద్దని నినదించిన, ప్రబోధించిన వీర కిశోరం, విప్లవ సింహం యువతరానికి స్ఫూర్తి ప్రధాత అమరజీవి భగత్ సింగ్ అని కొనియాడారు. భగత్ సింగ్ భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన మరణం ఈ దేశంలో విప్లవానికి శంఖారావాన్ని పూరించిందని, యువతరాన్ని మేల్కొల్పిందని, చైతన్యాన్ని రగిలించిందని, అన్ని వర్గాల ప్రజలను కదిలించిందని, ఎంతోమంది వీరులను విప్లవకారులను ఆనాటి స్వాతంత్రోద్యమంలో భాగస్వాములు చేసిందని, ఆనాటి అమరుల త్యాగ ఫలితమే ఈనాటి స్వాతంత్ర్యమని కాని ఆ అమరుల కలలు ఈనాటి వరకు నెరవేరలేదని, అధికార మార్పు మాత్రమే జరిగిందని అన్నారు. తెల్లదొరలు పోయి నల్లదొరలు వచ్చారని ,ప్రజల బ్రతుకుల్లో అణువంతైనా మార్పు రాలేదని, పేదరికం, దోపిడి పోలేదని, విద్య, వైద్యం, ఉద్యోగం, దున్నేవాడికే భూమి, గిట్టుబాటు ధరలు, ఆడపిల్లల జీవితాలకు భద్రత ఇంకెన్నో, మరెన్నో సమస్యలు తీరే దారి కనుచూపు మేరలో కానరావడం లేదని, కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల అవినీతి, అవకాశవాద ప్రజా వ్యతిరేక పాలన వల్ల ఈ దేశంలోని బడుగు బలహీన వర్గాలు, రెక్కాడితే డొక్కాడే కష్టజీవులు, రైతులు, వ్యవసాయ కూలీలు, అన్ని వర్గాల ప్రజలు ప్రతిరోజు పడరాని పాట్లు పడుతున్నారని అన్నారు. బతుకు బండిని లాగలేక పోతున్నారని, అందుకే అమరజీవి భగత్ సింగ్ అందించిన స్ఫూర్తితో యువత నడుం కట్టాలని, పిడికిలెత్తాలని, ఈ దోపిడి పాలనకు చరమగీతం పాడాలని, జనతా ప్రజాస్వామిక విప్లవాన్ని సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సబ్బని రాజేంద్రప్రసాద్, పసులేటి వెంకటేష్, ఆరెపల్లి రమేష్, అరుణ్, అంబాల రాజన్న, పెంటి రాకేష్, అనిల్, సబ్బని విజయలక్ష్మి, కాంపల్లి రాధ, లత తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ వడ్డీ వ్యాపారం నిర్వహించే వారికి అరదండాలు తప్పవు


కరీంనగర్ సీపీ వి.సత్యనారాయణ



**కరీంనగర్, మార్చి 23 (అక్షర వెలుగు):** కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో అక్రమ వడ్డీ వ్యాపారుల, చట్ట విరుద్ధమైన చిట్టి వ్యాపారుల ఆగడాలు శృతి మించడంతో వారి అక్రమ వ్యాపారాలకు అడ్డుకట్ట వేయడానికి కరీంనగర్ పోలీసులు నడుంబిగించారు. అక్రమ వడ్డీ వ్యాపారుల వల్ల ఎన్నో కుటుంబాలు చిన్నాభిన్నమై, మరెంతో మంది అప్పులు తీర్చలేక, వడ్డీ వ్యాపారుల వేధింపులు తట్టుకోలేక తమ జీవితాన్ని చాలించిన సంఘటనలు మన కళ్ళ ముందు నుండి ఇంకా చెదిరి పోలేదు. ఇటీవల నిజామాబాద్ జిల్లాలో కూడా ఒక కుటుంబం అప్పులు తీర్చలేక, ఆ వ్యాపారి వేధింపులు తట్టుకోలేక కుటుంబ పెద్దతో సహ నలుగురు ఇంటిలోనె ఉరిపోసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సబ్య సమాజాన్ని ఎంతో కలచివేసింది. కరీంనగర్ లో కూడా గతంలో ఇలాంటి పలు సంఘటనలు జరుగగా, మేము చట్టపరంగా కఠిన చర్యలు తీసుకున్నప్పటికీ, వడ్డీ వ్యాపారులు తమ వ్యాపారాన్ని కొత్త పుంతలు తొక్కిస్తు, తమ కార్యలాపాలను సాగిస్తున్న విషయం మా దృష్టికి వచ్చింది. మధ్య తరగతి పేద వర్గాలకు చెందిన వారు తమ ఆర్థిక అవసరాలకు వడ్డీ వ్యాపారులను సంప్రదించగా, వారి అవసరాన్ని ఆసరాగా చేసుకొని,ఆ వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా ఐదు రూపాయల నుండి పది రూపాయల వరకు వడ్డీ వసూలు చేస్తూ, ప్రజల రక్తాన్ని జలగల్లా పీలుస్తున్నారు. మరికొంతమంది వారు ఇచ్చిన అప్పుకు సెక్యూరిటీ కింద వారి ఆస్తులను కూడా క్రయ విక్రయాల రూపంలో రిజిస్టేషన్ చేసుకొని తర్వాత పూర్తిగా కబ్జా చేసుకున్న సందర్భాలు కూడా మా దృష్టికి వచ్చినవి. ఇంతే కాకుండా రకరకాల ఫిర్యాదులు ప్రతిరోజు పోలీస్ స్టేషన్లకు వస్తున్నవి. మరికొంతమంది అక్రమ చిట్టీలు నడిపిస్తూ, చిట్టి డబ్బులు అన్ని నెలలు పూర్తిగా చెల్లించుకొని, చిట్టీ ఎత్తుకున్నా, వారికి చిట్టీ డబ్బులు చెల్లించకుండా వేదిస్తున్న సంఘటనలు పోలీసుల దృష్టికి వస్తున్నవి. ఇటువంటి అక్రమ కార్యకలాపాలతో ఎంతోమంది ఉసురు తీసుకుంటున్న ఈ వడ్డీ వ్యాపారులు మరియు చట్ట విరుద్ధమైన చిట్టి యజమానుల పై కఠిన చర్యలు తీసుకోవలని.జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, ఏక కాలంలో 37 ప్రదేశాలలో, దాడులు నిర్వహించడం జరిగింది. ఈ దాడుల్లో పలువురు వడ్డీ వ్యాపారులు నిర్వహించే, వడ్డీ వ్యాపారాలకు సంబంధించిన సంతకం చేసిన ఖాళీ ప్రామిసరీ నోట్లు, డాక్యుమెంట్స్, బ్లాంక్ చెక్కులు మరియు రూ. 52,57,768/- నగదును కూడా స్వాధీనం చేసుకోవడం జరిగినది. ఇప్పటి వరకు 10 మంది ని అదుపులోకి తీసుకొని, హుజురాబాద్ డివిజన్ నందు 6 కేసులు మరియు కరీంనగర్ డివిజన్ నందు 4 కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించటం జరిగినది. వీరిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోనైనది అని కరీంనగర్ సి పి వి సత్యనారాయణ అన్నారు

## సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరం

పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి



**వికారాబాద్, మార్చి 23 (అక్షర వెలుగు):** న్యూస్: సీఎం సహాయ నిధి నిరుపేదలకు కొండంత అండ అన్ని ఎమ్మెల్యే మహేష్ రెడ్డి అన్నారు. బుధవారం వికారాబాద్ జిల్లా,పరిగి పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో పుడూర్, పరిగి, దోమ, కుల్కచెర్ల, చౌడపూర్, గండీడ్, మహమ్మదాబాద్ మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 41 మంది ఇటీవల్ల అనారోగ్యనికి గురి కావడంతో వారికి సీ ఎం సహాయ నిధి ద్వారా ఎమ్మెల్యే మహేష్ రెడ్డి 26,81,500/- రూపాయల చెక్కులను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి మాట్లాడుతూ పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి కేసీఆర్ అండగా ఉంటున్నారని, అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్న వారికి అయ్యే ఖర్చు ప్రభుత్వం భరిస్తూ సీఎం రిలీఫ్ ఫండ్, ఎల్ ఓ సి లు అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పరిగి నియోజకవర్గ ప్రజాప్రతినిధులు,తెరాస నాయకులు,లబ్ది దారులు, తదితరులు పాల్గొన్నారు..

## భగత్ సింగ్ స్ఫూర్తితో విద్యార్థులు, యువత దేశంలో మతోన్మాదం, మహిళలపై దాడులకు వ్యతిరేకంగా పోరాడాలి: ఎస్ఎఫ్ఐ

**అందోల్, మార్చి 23 (అక్షర వెలుగు):** అందోల్ నియోజకవర్గంలో ఎస్ ఎఫ్ ఐ అందోల్ డివిజన కమిటీ ఆధ్వర్యంలో భగత్ సింగ్,రాజ్ గురు, సుఖ్ దేవ్ 91వ వర్ధంతి జోగిపేట్ లోని ఎస్సీ( ఏ ) హాస్టల్ లో సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రోళ్ల మహేష్ మాట్లాడుతూ దేశంలో కులం,మతం,ప్రాంతం, రంగు,వర్ణ,వివక్ష బేధం లేకుండా ఆనాడు దేశంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా భారత దేశ స్వతంత్రం,స్వయం పరిపాలన కోసం భగత్ సింగ్ చిన్న వయసులోనే ఈ దేశం కోసం పోరాడి ప్రాణాలర్పించిన గొప్ప వ్యక్తి భగత్ సింగ్ అని కొనియాడారు. మా దేహం ముక్కలైనా ఈ దేశాన్ని ముక్కలు కానివ్వం అనే నినాదంతో బ్రిటిష్ వారిపై దండయాత్ర చేసిన గొప్ప వ్యక్తి భగత్ సింగ్ అని అన్నారు. నేటి యువత దేశంలో విద్య కాషాయీకరణకు, మహిళలపై అత్యాచారాలకు, దాడులకు వ్యతిరేకంగా రాజ్యాంగ పరిరక్షణ కోసం యువత పెద్ద ఎత్తున ఉద్యమించాలని పిలుపునిచ్చారు. బిజెపి ప్రభుత్వం వచ్చినప్పటి నుండి దేశంలో విద్యార్థులపై, మహిళలపై దాడులను ప్రోత్సహిస్తున్న ఫాసిస్టు విధానాలు నశించాలి అన్నారు. ఈ కార్యక్రమంలో లిఎస్ఎస్ఐ నాయకులు అనిల్ బలరాం అశోక్ యాకోబ్ మరియు విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## సర్దార్ రణధీర్ సింగ్ రానా ఆధ్వర్యంలో షహీద్ భగత్ సింగ్ 91 వ వర్ధంతి



**కరీంనగర్,మార్చి 23 (అక్షర వెలుగు):** కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు సర్దార్ రణధీర్ సింగ్ రానా ఆధ్వర్యంలో షహీద్ భగత్ సింగ్ 91వ షహీద్ దివాస్ సందర్భంగా కరీంనగర్ జిల్లా భగత్ నగర్ లోని భగత్ సింగ్ విగ్రహానికి పూల మాలలు వేసి ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు నివాళులు అర్పించారు ఈ కార్యక్రమంలో లో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు రణధీర్ సింగ్ రానా మాట్లాడుతూ షహీద్ భగత్ సింగ్ వారు చేసిన నా ఉద్యమ పోరాటంలని వారు దేశం కోసం చేసిన బలిదానాన్ని కొనియాడారు షహీద్ భగత్ సింగ్ ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకొని రాష్ట్రంలో మరియు దేశంలో జరుగుతున్న అవినీతి పై మరియు రాష్ట్ర ప్రభుత్వం మరియు కేంద్ర ప్రభుత్వం వల్ల ప్రజలు పడుతున్న సమస్యలపై పోరాటం చేయాలని అని కోరారు ఈ కార్యక్రమంలో లో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు నాగుల నితిన్, ప్రణయ్, పవన్ కళ్యాణ్, నారాయణ, సంపత్, రమేష్, సందీప్, నవీన్ ,మరియు ఇతరులు పాల్గొన్నారు.

## చల్వాయిలో బస్టాండ్ స్థలంలో పెట్రోల్ బంక్ వద్దు బస్ స్టాండు నిర్మాణం చేయాలి



**ములుగు, మార్చి 23 (అక్షర వెలుగు):** గోవిందరావుపేట మండల కేంద్రంలోని చల్వాయి గ్రామంలో గతంలో ములుగు నుండి ఏటూరునాగారం వరకు ఎక్కడ ఆర్టీసీ బస్టాండు లేని సమయంలో చల్వాయి గ్రామంలో ఆర్టీసీ బస్టాండ్ ఉండేది దాంట్లో కంట్రోల్ రూమ్ తో సహా ఉండేవి అలాంటి సమయంలోనే ఆర్టీసీ బస్టాండ్ ఉండేదంటే రోజు రోజుకి అభివృద్ధి చెందాల్సిన సమయంలో ఆర్టీసీ బస్టాండ్ మొత్తం శిథిలావస్థకు వస్తేదాన్ని మొత్తం తీసేసి ఆర్టీసీ సంస్థ పెట్రోల్ బంక్ ప్రైవేటు వ్యక్తులకు లీజుకు ఇవ్వడం అనేది ప్రజలకు బస్టాండ్ సౌకర్యం లేకుండా చేసినట్టే అవుతుంది అని చెప్పి గ్రామ ప్రజాప్రతినిధులు గ్రామ ప్రజలు మా బస్టాండ్ స్థలంలో మాకు బస్టాండ్ నిర్మించాలని ఆందోళన నిరసన కార్యక్రమం చేపట్టారు అదే సమయంలో గ్రామ ఉపసర్పంచ్ తేళ్ల హరి ప్రసాద్ గారు మాట్లాడుతూ గ్రామానికి ఆర్టీసీ బస్టాండ్ ముఖ్యం అని చెప్పి అది లేక ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు అలాగే ప్రజలకు ఆర్టిసి అందించాల్సిన సేవలు అందించక పోగా ఇలా ప్రైవేటు వ్యక్తులకు పెట్రోల్ బంకు లకు ఆర్టీసీ స్థలాలను లీజుకు ఇవ్వడం మానేసి త్వరగా ఆర్టీసీ స్థలంలో బస్టాండ్ నిర్మాణంలోకి తీసుకొచ్చి గ్రామ ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో భూరెడ్డి మధు బైకని ఓదెలు కృష్ణారెడ్డి చుక్క గట్టయ్య సత్తు భద్రయ్య మేడిపల్లి మహేందర్ మెరుగు రమేష్ దర్శనాల సంజీవ ఏనుగుల సాంబశివరావు సత్తు వీరస్వామి గుండె శ్యామ్ గాదె రమేష్ సమ్మయ్య మరియు పూసల మంజుల విజయ్ వేణుగోపాల్ రాంరెడ్డి పడిదాల సాంబయ్య రమేష్ రమ ప్రసాద్ రెడ్డి వెంకటయ్య దుర్గయ్య ఎల్లయ్య కృష్ణ వెంకటయ్య దేవి రెడ్డి శ్రీనివాస్ పూర్ణయ్య వెంకన్న రాజు మరియు గ్రామ ప్రజలు మహిళలు తదితరులు పాల్గొనడం జరిగింది

## మేడారం సమ్మక్క పూజారి అనారోగ్యంతో మృతి



**ములుగు, మార్చి 23(అక్షర వెలుగు):** తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క పూజారి సిద్దబోయిన సాంబయ్య(38) బుధవారం తెల్లవారు జామున మృతిచెందారు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం సుమారు 15 రోజుల నుండి అనారోగ్యంతో బాధపడు తున్నాడు. నిన్న రాత్రి తెల్లవారుజామున మూడు గంటల సమయంలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కావడంతో బంధువులు మేడారం నుండి ఏటూరు నాగారం సామాజిక ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ బుధవారం తెల్లవారుజామున సాంబయ్య మృతి చెందినట్లు తెలిపారు. సాంబయ్య మృతితో మేడారం పూజారులు, ఆదివాసీలు, మృతుడి కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. కోట్లాది మంది భక్తుల నమ్మకానికి ప్రతిరూపమైన సమ్మక్క దేవతను సిద్దబోయిన, చందా, కొక్కెర, ఎంపెల్లి వంశస్తుల చేతుల మీదుగా తీసుకువచ్చి గద్దెలపై ప్రతిష్టిస్తారు. సిబ్బబోయిన వంశానికి చెందినవారిలో ఒకరైన సాంబయ్య ఇటీవల జరిగిన మేడారం జాతరలోనూ చురుగ్గా పాల్గొన్నారు. సమ్మక్క పూజలు నిర్వహించడం, చిలుకల గుట్ట నుండి సమ్మక్క దేవతను గద్దెలపైకి తీసుకురావడంలో సహచర పూజారులతో కలిసి చురుకైన పాత్ర పోషించారు. సాంబయ్య మృతి పట్ల తెలంగాణ మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకరరావు, సత్యవతి రాథోడ్, ములుగు ఎమ్మెల్యే సీతక్క ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు. కాగా సాంబయ్య కు ఇద్దరు కూతుళ్లు భార్య కలరు. వీరిని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని పూజారుల సంఘం ఆదివాసి సంఘాలు, తుడుందెబ్బ సంఘాలు కోరుతున్నాయి.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **GPR PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
TITLE CODE.TELTEL02057, Cell:8464816456 Email: aksharavelugudaily@gmail.com, Website: www.aksharavelugu.com